మంగళవారం
TUESDAY
13-10-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 105

జగిత్యాల JAGITIAL || పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

EVARTHALU


దినపత్రిక



నాని బియ్యం బతుకమ్మ శుభాకాంక్షలు

అరచేతిలో ఈవార్తలు దినపత్రిక
స్కాన్ చేయండి..
ఆండ్రాయిడ్ యాప్
డౌన్‌లోడ్ చేసుకోండి..
GET IT ON Google Play

రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు 'ఆర్థిక' నోబెల్



జెనీవా: ఆర్థిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతిని అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు ప్రకటించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను నియంత్రించేందుకు ఉపయోగపడే నమూనాల రూపకల్పనకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై వారు చేసిన పరిశోధనకు ఈ పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది. రాబర్ట్ ఈ. హాల్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో రాజకీయ ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం తరువాయి 2 వ పేజీలో...



ఈవీ కారు కాలి..
నలుగురి సజీవదహనం

మరొకరి పరిస్థితి విషమం.. విజయవాడ బైపాస్‌పై ఘోర ప్రమాదం

విజయవాడ, అక్టోబర్ 12 (ఈవార్తలు): ఏపీలోని విజయవాడ నగర శివార్లలోని పశ్చిమ బైపాస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. వారు ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు (ఈవీ) ప్రమాదానికి గురైన వెంటనే మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతులను నున్న, నంబూరు ప్రాంత వాసులుగా తరువాయి 2 వ పేజీలో...



న్యాయం చేయండి 'సర్'!

సుప్రీంలో 11 మంది 'ఇండియా' నేతల పిటిషన్

అవకతవకలు జరిగాయని తీవ్ర ఆరోపణలు

న్యూఢిల్లీ: న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం, ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – సర్) ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 'ఇండియా' కూటమి నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా 11 మంది సీనియర్ నేతలు సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తరువాయి 2 వ పేజీలో...

జంతర్ మంతర్ వద్ద ధర్నాలు బంద్

ఇక నిరసనలు చేయలేరు: ఢిల్లీ పోలీసులు



రేవంత్ బిజీ.. రైతులు గజిబిజి!

"రైతువేదికల్లో రైతులు.. కానరాని పాలకులు

రైతులను రమ్మని.. రేవంత్ రాకపాయే!

ఎల్‌నినోపై మీటింగ్ అని ప్రకటన
సీఎం సహా మంత్రులంతా హస్తినకు
సీఎస్ ఉత్తర్వులిచ్చినా జరగని భేటీ
రాజకీయాలకే రేవంత్ ప్రాధాన్యం: బీఆర్ఎస్

రాష్ట్రంలో కరువు పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగానికి ఎదురయ్యే ముప్పుపై చర్చించేందుకు మంత్రులంతా సోమవారం అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఈ నెల 9వ తేదీనే ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఉదయం 11 గంటలకు అనధికారిక మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నట్లు అధికార వర్గాల్లో ప్రచారం సాగింది.



హైదరాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి కరువు పరిస్థితులను సమీక్షించబోతున్నారంటూ ప్రచారం కూడా జరిగింది. అయితే, చివరకు ఆ సమావేశం ఏమైందన్న దానిపై స్పష్టత లేకుండాపోయింది. ముఖ్యమంత్రి గోవా పర్యటన అనంతరం ఢిల్లీకి వెళ్లడం, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తరువాయి 2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

(గ్రాము-24 క్యారెట్స్):	రూ.14,968
వెండి (కిలో):	రూ.2,45,000
ప్లాటినం (గ్రాము):	రూ.5,233



కేరళం నూతన గవర్నర్‌గా ఓం ప్రకాశ్ మాథుర్

తమిళనాడు గవర్నర్‌గా రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్

6 రాష్ట్రాలకు నూతన గవర్నర్లు.. రాష్ట్రపతి ఉత్తర్వులు

న్యూఢిల్లీ: దేశంలోని ఆరు రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం నూతన గవర్నర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల ప్రకారం కేరళం, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు బాధ్యతలు చేపట్టనున్నారు. కొందరిని బదిలీ చేయగా, మరికొందరిని కొత్తగా నియమించారు. వివరాల్లోకి వెళితే, ప్రస్తుతం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మాథుర్‌ను కేరళం నూతన గవర్నర్‌గా నియమించారు. ఇప్పటివరకు కేరళం గవర్నర్‌గా పనిచేసిన రాజేంద్ర విశ్వనాథ్ తరువాయి 2 వ పేజీలో...

రేవంత్ శాఖలో దోపిడీ

రేడియల్ రోడ్ టెండర్లలో అవకతవకలు.. రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్

600 కోట్లు తక్కువ బిడ్ వేసినా తప్పించారని మండిపాటు



తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు.

హైదరాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.



బలపడ్డ రూపాయి


ముంబై: భారత కరెన్సీ రూపాయి పతనాన్ని అడ్డుకుని, మార్కెట్లో స్పెక్యులేషన్‌కు కళ్లెం వేసేందుకు ఆర్బీఐ తీసుకున్న తాజా చర్యలు వెంటనే సానుకూల ఫలితాలనిచ్చాయి. సోమవారం ఫారెక్స్ మార్కెట్ ప్రారంభంలోనే అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఒక శాతానికి పైగా లాభపడి 95.76 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టింది. ఆఫ్‌షోర్ మార్కెట్లోనూ రూపాయి బలంగా పుంజుకుంది. 2013 తర్వాత రూపాయిని నిలబెట్టేందుకు ఆర్బీఐ తీసుకున్న అత్యంత కఠినమైన



పొరపాటున డబ్బు పంపామని కాల్!

ఈ ఫోన్ వస్తే జాగ్రత్త.. ఎస్బీఐ హెచ్చరిక

న్యూఢిల్లీ: 'మీ బ్యాంకు ఖాతాలో అకస్మాత్తుగా రూ.100 లేదా రూ.500 జమయ్యాయి. పొరపాటున మీ ఖాతాకు డబ్బులు పంపించాం. దయచేసి తిరిగి పంపండి' అంటూ అవతలి వ్యక్తి అభ్యర్థన. మన డబ్బులు కాకపోవడంతో వెంటనే తిరిగి పంపించాలనుకుంటున్నారా? ఒక్క నిమిషం ఆగండి! మీరు పంపే డబ్బులే కాదు.. మీ ఖాతాలో ఉన్న సొమ్ము కూడా ప్రమాదంలో పడొచ్చు. ఈ తరహా మోసంపై



నో అని రిప్లై ఇచ్చినా ఖాతా ఖాళీ

గుర్తుతెలియని నంబర్లు బ్లాక్ చేయాలి: సజ్జనార్

హైదరాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): ఓటీపీ చెప్పాల్సిన పనిలేదు, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయక్కర్లేదు.. కేవలం 'నో' అని రెండక్షరాల సమాధానం ఇస్తే చాలు.. మీ బ్యాంక్ ఖాతాలోని సొమ్ము క్షణాల్లో మాయం!

విశ్వవాణి



కెనడా రాజధాని ఒట్టావాలోని 'ట్రంప్ అవెన్యూ' పేరును తొలగించేందుకు నగర కౌన్సిల్ ఏకగ్రీవంగా నిర్ణయించింది. 25 ఏళ్లకు పైగా ఈ వీధికి ట్రంప్ పేరు ఉంది. 1990ల చివరలో, 2000ల ప్రారంభంలో న్యూయార్క్ నగర నేపథ్యంతో ఏర్పాటు చేసిన ప్రాంతంలో భాగంగా ఈ పేరు పెట్టారు. 2027లో కొత్త పేరును కౌన్సిల్ ఆమోదించనుంది.

ఏ రోగానికి ఎంత చార్జీ?

చికిత్స చార్జీలను స్పష్టంగా చెప్పాలి
అన్ని దవాఖానల్లో ప్రదర్శించాలి
రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు



దేశవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లు తమ వద్ద అందించే వైద్య సేవలకు వసూలు చేసే చార్జీలను అందరికీ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వైద్య సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు కేంద్రం సోమవారం స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ: ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఆసుపత్రులలో చార్జీల ప్రదర్శనకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో సమీక్షించాలని, తరువాయి 2 వ పేజీలో...



ఏపీ 'స్థానిక' రిజర్వేషన్లు ఖరారు

మున్సిపాలిటీలలో బీసీలకు 35, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 చైర్మన్ పీఠాలు

అమరావతి, అక్టోబర్ 12 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పురపాలక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 మున్సిపాలిటీలు, -2 వ పేజీలో...

రాశి ఫలాలు

13.10.2026

మేషం: దూరప్రయాణాల వలన శ్రమ అధికమౌతుంది. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందదు. వృథా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఆటుపోట్లు తప్పవు. బంధువులతో అకారణంగా మాట పట్టింపులుంటాయి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు.

వృషభం: గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు.

మిథునం: ఆరోగ్యపరంగా చికాకులు తప్పవు. వ్యాపారాలలో జాగ్రత్త అవసరం. చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు ఉంటాయి. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఇతరులకు ధనపరంగా మాట ఇవ్వడం మంచిది కాదు. ఉద్యోగమున మీ కష్టం ఫలించదు.

కర్కాటకం: ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి. గృహ నిర్మాణ ప్రయత్నాలలో ముందడుగు వేస్తారు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. దూరపు బంధువుల నుండి అందిన సమాచారం ఊరట కలిగిస్తుంది. స్నేహితులతో వివాదాలు సర్దుబాటు కాగలవు.

సింహం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. బంధుమిత్రుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. ఆదాయం సంతృప్తినిస్తుంది. సోదరులతో శుభాకార్య విషయాలపై చర్చలు చేస్తారు.

కన్య: దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. నూతన ఋణాలు చేస్తారు. ఇంటా బయట బాధ్యతలు ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక ప్రశాంతత లోపిస్తుంది. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు అధికమౌతాయి.

తుల: చిన్నపాటి అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. బందు మిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని మార్పులుంటాయి. కొన్ని కార్యక్రమాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. రెండు రకములైన ఆలోచన వలన ధన నష్టాలు తప్పవు.

వృశ్చికం: ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. నిరుద్యోగులు నూతన ఉద్యోగ అవకాశములు పొందుతారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. నూతన కార్యక్రమాలు చేపడతారు. వృత్తి వ్యాపారాలలో మీ అంచనాలు నిజమవుతాయి.

ధనస్సు: వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం కలుగుతుంది. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు సానుకూలమౌతాయి. గృహ నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. చిన్ననాటి స్నేహితుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి.

మకరం: దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. రాబడికి మించి ఖర్చులు పెరుగుతాయి. సోదరులతో అస్తి వివాదాలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని ఇబ్బందులుంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు ఫలించవు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

కుంభం: వృత్తి వ్యాపారాలలో అంచనాలు అందుకోవడంలో విఫలమౌతారు. సన్నిహితుల నుండి ఊహించని విమర్శలు ఎదురవుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు మందకోడిగా సాగుతాయి. ఆర్థిక సమస్యలు తప్పవు. చేపట్టిన పనులలో కష్టానికి తగ్గ ఫలితం దక్కదు. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు.

మీనం: వ్యాపార విస్తరణకు మిత్రుల సహాయం అందుతుంది. ఆదాయం గతం కంటే మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగాలు ఆశాజనకంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ సేవలకు తగిన గుర్తింపు పొందుతారు. సోదరులతో అస్తి వివాదాలు పరిష్కారమౌతాయి.

రైతులు గజిబిజి!

మొదటి పేజీ తరువాయి

సైతం హస్తినకు చేరుకోవడంతో రాష్ట్రంలో కరువు సమీక్ష వెనక్కి వెళ్లిపోయింది. రైతుల సమస్యలపై అత్యవసర సమావేశానికి ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వమే దాని నిర్వహణపై స్పష్టత ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సీఎస్‌కే క్లారిటీ లేదు..!

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్న నేపథ్యంలో మంత్రులంతా సోమవారం అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ద్వారా ఈ నెల 9న ఆదేశాలు జారీ అయ్యాయి. సమావేశం ఉదయం 11 గంటలకు ఉంటుందని భావించిన అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే, ముఖ్యమంత్రి ఆదివారం గోవా పర్యటనకు వెళ్లి అక్కడి నుంచి ఢిల్లీకి వెళ్లారు. సోమవారం కాంగ్రెస్ నిర్వహించిన సమావేశాలు, ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సీఎం సహా మంత్రులు, పార్టీ ప్రజాప్రతినిధులు ఢిల్లీకి వెళ్లారు. దీంతో రాష్ట్రంలో జరగాల్సిన కరువు సమీక్ష సమావేశం నిర్వహణపై అనిశ్చితి నెలకొంది. సమావేశం రద్దయిందా? వాయిదా పడిందా? తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారు? అన్న విషయాలపై స్పష్టమైన సమాచారం లేకపోవడం అధికార వర్గాల్లోనూ గందరగోళానికి కారణమైంది. సమావేశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికే స్పష్టత లేదని అధికార వర్గాల్లో ప్రచారం సాగింది.

రైతులకు భరోసా ఎక్కడ?

వర్షాలపై అనిశ్చితి, ఎండల తీవ్రత, సాగునీటి లభ్యత వంటి అంశాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్న తరుణంలో ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయాల్సి ఉంది. పంటల పరిస్థితి, నీటి లభ్యత, విత్తనాలు, ఎరువులు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, రైతులకు అవసరమైన సహాయ చర్యలపై ముందస్తు కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది. కరువు ముప్పు పొంచి ఉందన్న ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వ స్థాయిలో సమీక్షకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా, సమావేశంపై స్పష్టత లేకపోవడం ప్రభుత్వ సన్నద్ధతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై సమీక్షించాల్సిన ముఖ్యమంత్రి, మంత్రులు పార్టీ కార్యక్రమాల కోసం ఢిల్లీకి వెళ్లడాన్ని బీఆర్ఎస్ తప్పుబడుతోంది. రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల కంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయ కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆ పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. కరువు పరిస్థితులపై సమీక్షకు ఆదేశాలు జారీ చేసి, ఆ సమావేశం నిర్వహణపై స్పష్టత ఇవ్వకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆరోపిస్తున్నారు.



రైతువేదికల్లో రైతులు.. కానరాని పాలకులు

రాష్ట్రవ్యాప్తంగా రైతులంతా రైతువేదికల వద్ద ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షను ప్రత్యక్షంగా వీక్షించాలని పిలుపునిచ్చింది. కరువు సమస్యలపై ముఖ్యమంత్రి మాట్లాడతారని, కరువు ముప్పు నుంచి ఉపశమనం కల్పించే చర్యలపై ప్రభుత్వం భరోసా ఇస్తుందని అన్నదాతలు ఆశించారు. కానీ, తీరా చూస్తే సమీక్షకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులే హాజరుకాని పరిస్థితి నెలకొంది. రైతులను రైతువేదికల వద్దకు రావాలని పిలిచి, వారి సమస్యలపై చర్చించాల్సిన పాలకులే సమావేశానికి దూరంగా ఉండటం ప్రభుత్వ తీరుపై విమర్శలకు దారితీస్తోంది. రైతులకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా సమీక్షను చూపిస్తామని చెప్పిన ప్రభుత్వం.. అసలు సమీక్షే జరగకపోవడంతో ఏం సమాధానం చెబుతుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

న్యాయం చేయండి 'సర్'!

మొదటి పేజీ తరువాయి

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేత సౌగతా రాయ్, శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్, సీపీఎం నేత ఎం.ఏ. బేబీ, సీపీఐ నేత డి. రాజా, జేఎంఎం నాయకురాలు మహువా మాఝి, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత ఈ.టీ. మహ్మద్ బషీర్ పిటిషనర్లుగా ఉన్నారు. ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఇతర కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణకు రావలసి ఉంది. అంతకుముందు ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్‌కు లేఖ రాశామని, అయితే అధికారికంగా పిటిషన్ ద్వారా కోర్టును ఆశ్రయించాలని ఆయన సూచించారని రాహుల్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమతో కలిసి రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష నేతలు సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టారు.

రాహుల్ గాంధీతో భేటీకి సీజేఐ నిరాకరణ

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని ప్రతిపక్ష నాయకుల బృందంతో సమావేశమయ్యేందుకు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నిరాకరించారు. అయితే, సుప్రీంకోర్టు తలుపులు సామాన్యుడి నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధుల వరకు అందరి కోసం తెరిచే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఏ పౌరుడైనా తమ సమస్యలను పిటిషన్ల రూపంలో న్యాయస్థానం దృష్టికి తీసుకురావచ్చని, వాటిని చట్ట ప్రకారం విచారిస్తామని తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 'ఓట్ల చోరీ' ఆరోపణలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, తిరిగి బ్యాలెట్ పత్రాలను ప్రవేశపెట్టడం వంటి అంశాలపై ఒక వినతిపత్రం సమర్పించేందుకు సోమవారం తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే సీజేఐకి లేఖ రాశారు. ఆదివారం అందిన ఈ లేఖకు తాను అదే రోజు రాత్రి సమాధానం ఇచ్చానని, భేటీకి వీలుపడదని కారణాలతో సహా వివరించానని జస్టిస్ సూర్యకాంత్ సోమవారం మీడియాకు తెలిపారు. అయితే, ఆ లేఖలోని వివరాలను గోప్యంగా ఉంచుతున్నట్లు, పూర్తి సమాచారం కోసం లేఖ రాసిన వారినే అడగాలని సూచించారు.

ఏపీ 'స్థానిక' రిజర్వేషన్లు ఖరారు

మొదటి పేజీ తరువాయి

17 మున్సిపల్ కార్పొరేషన్లలో ఛైర్మన్, మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం తుది జాబితాను ప్రకటించింది. ఈ ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయింది. ఇక అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించేందుకు మార్గం సుగమమైంది. ప్రకటించిన జాబితా ప్రకారం, 106 మున్సిపాలిటీలలో ఛైర్మన్ పదవులకు గాను బీసీ (వెనుకబడిన తరగతులు) వర్గానికి 35 స్థానాలు, ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) వర్గానికి 14 స్థానాలు, ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) వర్గానికి 3 స్థానాలు కేటాయించారు. అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు మొత్తం 50 స్థానాలు రిజర్వ్ చేయడం గమనార్హం.

ఏ రోగానికి ఎంత చార్జీ?

మొదటి పేజీ తరువాయి

రోగులకు, వారి సహాయకులకు చార్జీల వివరాలు సులభంగా కనిపించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె తన లేఖలో కోరారు. చికిత్స ఖర్చులను పారదర్శకంగా ప్రదర్శించడం వల్ల రోగులు, వారి కుటుంబసభ్యులు వైద్యానికి అయ్యే వ్యయంపై ఒక అంచనాకు రాగలరని, తద్వారా ఆర్థికంగా ముందే ప్రణాళిక వేసుకోవడానికి వీలవుతుందని మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది. ఇది బిల్లింగ్ విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించి, వైద్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుందని పేర్కొంది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2010, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (సెంట్రల్ గవర్నమెంట్) రూల్స్-2012 ప్రకారం, ఈ చట్టం వర్తించే రాష్ట్రాల్లోని వైద్య సంస్థలు అందించే అన్ని సేవలు, సౌకర్యాల చార్జీలను తప్పనిసరిగా ప్రదర్శించాలి. ఈ వివరాలను ఇంగ్లీషుతో పాటు స్థానిక భాషలో కూడా అందరికీ కనిపించే ప్రదేశంలో ఉంచాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి, ఈ నిబంధనలను క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి గుర్తు చేశారు. కేంద్ర చట్టం వర్తించని రాష్ట్రాలు కూడా తమ సొంత నిబంధనల ప్రకారం చార్జీల ప్రదర్శనను తప్పనిసరి చేయాలని సూచించారు. ఇదే సమయంలో భారత్‌లో చికిత్స కోసం వచ్చే విదేశీ రోగుల విషయంలోనూ పారదర్శకత పాటించాలని కేంద్రం కోరింది. మెడికల్ లేదా ఆయుష్ వీసాలపై వచ్చే వారికి అందించే ప్యాకేజీ రేట్లను కూడా ప్రముఖంగా ప్రదర్శించేలా ఆసుపత్రులను ప్రోత్స హించాలని రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది. దీనివల్ల విదేశీ రోగులు సరైన నిర్ణయం తీసుకోవడానికి, ధరల విషయంలో ఫిర్యాదులు తగ్గించడానికి వీలవుతుందని, వైద్య రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

బలపడ్డ రూపాయి

మొదటి పేజీ తరువాయి

చర్యల్లో ఇవి కూడా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రూపాయి మారకం విలువ రికార్డు స్థాయి కనిష్ఠమైన 97కు చేరువవుతుండటంతో ఆర్బీఐ రంగంలోకి దిగింది. శనివారం నాడు పలు కీలకమైన చర్యలను ప్రకటించింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థల డాలర్ అవసరాలను తీర్చడం కోసం ఒక ప్రత్యేక విండోను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. దీంతో పాటు ఫారెక్స్ డెరివేటివ్ లావాదేవీలపై కొత్త రిజర్వ్ నిబంధనను కూడా ప్రవేశపెట్టింది. అంతకుముందు గత బుధవారం వడ్డీ రేట్లను పెంచిన ఆర్బీఐ, అవసరమైతే మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని సంకేతాలిచ్చింది.

ఈవీ కారు కాలి.. నలుగురి సజీవదహనం

మొదటి పేజీ తరువాయి

గుర్తించారు. వీరంతా నంబూరులో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ ఇళ్లకు పయనమవుతుండగా ఈ విషాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ప్రమాదానికి గురై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆక్రందనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జంతర్ మంతర్ వద్ద ధర్నాలు బంద్

ఇక నిరసనలు చేయలేరు: ఢిల్లీ పోలీసులు

దేశ రాజధానిలో నిరసనలకు చిరునామాగా ఉన్న జంతర్ మంతర్ విషయంలో ఢిల్లీ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై అక్కడ నిరసనలు నిర్వహించేందుకు అనుమతిని రద్దు చేశారు. నిరసనల కోసం ప్రత్యామ్నాయంగా మూడు ప్రాంతాలను ఎంపిక చేశారు. రామ్‌లీలా మైదాన్, బురారీ మైదాన్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్‌లను నిరసన వేదికలుగా ప్రకటించారు. ఢిల్లీ పోలీసుల స్టాండింగ్ ఆర్డర్ నంబర్ ఎల్‌డబ్ల్యూ/48/2026 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసుల మేరకు జంతర్ మంతర్‌ను నిర్దేశిత నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించినట్లు పోలీసులు వెల్లడించారు. కొత్తగా ఎంపిక చేసిన మూడు ప్రాంతాల్లో నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించేందుకు సంబంధించిన సవరించిన మార్గదర్శకాలను విడిగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. గతంలో జారీ చేసిన 2022 ఏప్రిల్ 28 నాటి స్టాండింగ్ ఆర్డర్‌లో కొంతమేర మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష కూటమితో పాటు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనలకు సిద్ధమైన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.అందుకు 24 గంటల అల్టిమేటం కూడా జారీ చేశారు. ఆలోపే పోలీసులు నిర్ణయాన్ని వెలువరించారు.

కేరళం నూతన గవర్నర్‌గా ఓం ప్రకాశ్ మాథుర్

మొదటి పేజీ తరువాయి

ఆర్లేకర్‌ను తమిళనాడు గవర్నర్‌గా బదిలీ చేశారు. ఇక, కర్ణాటక కొత్త గవర్నర్‌గా డాక్టర్ సుధా యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్రపతి భవన్ నిర్ణయం తీసుకుంది. ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, ఒడిశా గవర్నర్‌గా బ్రిజ్ మోహన్ రామ్, ఉత్తరాఖండ్ గవర్నర్‌గా డాక్టర్ ధల్ సింగ్ బిసెన్‌ను నియమించారు. ఓం ప్రకాశ్ మాథుర్ కేరళంకు బదిలీ కావడంతో, ఖాళీ అయిన సిక్కిం గవర్నర్ పదవిలో దుష్యంత్ గౌతమ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ తన ప్రకటనలో పేర్కొంది. ఈ నియామకాలన్నీ సంబంధిత వ్యక్తులు తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి తక్షణమే అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి కార్యాలయం జారీ చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది.

పొరపాటున డబ్బు పంపామని కాల్!

మొదటి పేజీ తరువాయి

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్బీఐ ఖాతాదారులను అప్రమత్తం చేసింది. ఈ మోసాన్ని 'జంప్డ్ డిపాజిట్ స్కామ్'గా పిలుస్తున్నారు. 'సైబర్ నేరగాళ్లు తొలుత బాధితుల ఖాతాల్లో చిన్న మొత్తాన్ని జమ చేస్తారు. ఆ తర్వాత పొరపాటున పంపించామని చెబుతూ ఫోన్ చేస్తారు. డబ్బులు తిరిగి పంపాలని కోరతారు. ఇక్కడే అసలు మోసం మొదలవుతుంది. సాధారణంగా డబ్బులు పంపాల్సిందిగా అడగడానికి బదులు.. యూపీఐ ద్వారా పేమెంట్ రిక్వెస్ట్ పంపిస్తారు. బాధితుడు దాన్ని ఆమోదిస్తే.. జమ చేసిన చిన్న మొత్తానికి బదులుగా ఖాతాలోంచి పెద్ద మొత్తంలో డబ్బులు మాయమయ్యే ప్రమాదం ఉంది. ఈ తరహా మోసాల్లో నేరగాళ్లు బాధితులను కంగారు పెట్టే ప్రయత్నం చేస్తారు. అత్యవసరమని, వెంటనే డబ్బులు పంపాలని ఒత్తిడి చేస్తారు. వారి మాటలు నమ్మి తొందరపడి యూపీఐ రిక్వెస్ట్‌ను ఆమోదిస్తే ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. చిన్న మొత్తాన్ని ముందుగా జమ చేయడం ద్వారా బాధితుల్లో నమ్మకం కలిగించడమే ఈ ముఠాల ప్రధాన వ్యూహం' అని పేర్కొంది.

రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు 'ఆర్థిక' నోబెల్

మొదటి పేజీ తరువాయి

వంటి పరిస్థితులను ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకుని తగిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ అధ్యయనాలు కీలకంగా నిలుస్తాయి. ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారాన్ని అధికారికంగా 'ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర బహుమతి' అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో దీన్ని ఏర్పాటు చేసింది. 1969లో తొలిసారిగా ప్రదానం చేశారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు నోబెల్ బహుమతుల్లో ఆర్థిక శాస్త్ర పురస్కారం లేదు. అయినప్పటికీ మిగతా నోబెల్ పురస్కారాలతో పాటే ఏటా డిసెంబర్ 10న దీన్ని అందజేస్తారు. 1896లో అదే రోజున నోబెల్ మరణించారు. 2025లో ఈ బహుమతి జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు లభించింది. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించినందుకు వారిని ఎంపిక చేశారు.

నో అని రిప్లై ఇచ్చినా ఖాతా ఖాళీ

మొదటి పేజీ తరువాయి

సాంకేతికతను వాడుకుని సైబర్ నేరగాళ్లు పన్నిన ఈ సరికొత్త పన్నాగం ఇప్పుడు పెను సవాలుగా మారింది. 'ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్'గా పిలుస్తున్న ఈ ప్రమాదకరమైన మోసంపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఈ మోసం ఎలా పనిచేస్తుందో, దాని నుంచి ఎలా రక్షించుకోవాలో ఆయన సమగ్రంగా వివరించారు. సైబర్ కేటుగాళ్లు పక్కా ప్రణాళికతో ఈ మోసానికి పాల్పడుతున్నారు. ముందుగా, గుర్తుతెలియని వాట్సాప్ నంబర్ నుంచి మీ ఫోన్‌కు ఒక సందేశం వస్తుంది. 'మీ బ్యాంక్ ఖాతా నుంచి ఇంత మొత్తం డెబిట్ అయ్యింది' అని ఆ మెసేజ్‌లో ఉంటుంది. అది చూసిన వెంటనే ఎవరైనా కంగారుపడటం సహజం. ఆ కంగారును ఆసరాగా చేసుకుని, వెంటనే మరో సందేశం పంపుతారు. 'ఈ లావాదేవీ మీరు చేయకపోతే, వెంటనే నో అని రిప్లై ఇవ్వండి' అని అందులో సూచిస్తారు. ఖాతాలో డబ్బులు పోయాయన్న ఆందోళనతో చాలామంది ఆలోచించకుండా 'నో' అని టైప్ చేసి పంపేస్తారు. అక్కడే అసలు మోసం దాగి ఉంది. మీరు 'నో' అని సమాధానం పంపిన మరుక్షణమే, ఆ సందేశంలో కంటికి కనిపించకుండా దాగి ఉన్న మాల్‌వేర్ స్ట్రిప్ట్ లేదా ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్స్ యాక్టివేట్ అవుతాయి. ఈ ఫైల్స్ హ్యాకర్లకు మీ మొబైల్ ఫోన్‌పై పూర్తి నియంత్రణను (రిమోట్ యాక్సెస్) అందిస్తాయి. దీంతో వారు మీ ఫోన్‌లోని బ్యాంకింగ్ యాప్‌లు, పాస్‌వర్డ్‌లు, ఇతర సున్నితమైన సమాచారాన్ని సులభంగా దొంగిలించి, క్షణాల్లో మీ బ్యాంక్ ఖాతాను పూర్తిగా ఖాళీ చేస్తారు. ఈ ప్రమాదకరమైన మోసం నుంచి ప్రజలు తమను తాము కాపాడుకోవడానికి వీసీ సజ్జనార్ పలు కీలక సూచనలు చేశారు. అలాంటి సందేశాలు రాగానే కంగారు పడకుండా, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి, చాట్‌ను పూర్తిగా డిలీట్ చేయాలి. నిజంగా మీ ఖాతా నుంచి డబ్బు కట్ అయిందో లేదో తెలుసుకోవడానికి మీ బ్యాంక్ అధికారిక మొబైల్ యాప్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెక్ చేసుకోవాలి. వాట్సాప్ సందేశాలను అస్సలు నమ్మవద్దని సూచించారు.

మల్యాల పోలీసులకు ఎస్పీ ప్రశంస

మల్యాల, అక్టోబర్ 12 (ఈవార్తలు): వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి సామగ్రి చోరీ చేస్తున్న ముఠా కేసును ఛేదించిన మల్యాల పోలీసులను జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లు రాజేందర్, విక్రాంత్, ఆంజనేయులుకు జిల్లా కేంద్రంలో ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. రైతులకు నష్టం కలిగించే నేరాల నియంత్రణలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ సందీప్ పాల్గొన్నారు.

ఉక్రెయిన్ యుద్ధంలో తెలంగాణ వాసి మృతి

మృతుడి కుటుంబానికి సర్కారు రూ. 6 లక్షల సాయం

జగిత్యాల, అక్టోబర్ 12 (ఈవార్తలు): రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తెలంగాణ వాసి కుటుంబానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. జగిత్యాల జిల్లా, హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ మృతిచెందగా, అతడి కుటుంబానికి రూ. 6 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, సుదర్శన్ గౌడ్ ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడ జరుగుతున్న యుద్ధంలో భాగంగా క్షిపణులు, డ్రోన్ దాడుల కారణంగా అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సుదర్శన్ గౌడ్ భార్య విజ్ఞప్తి మేరకు, ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే మానవతా దృక్పథంతో స్పందించిన సీఎం, ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, సీఎం సహాయ నిధి నుంచి ఈ మొత్తాన్ని విడుదల చేసేందుకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, సుదర్శన్ గౌడ్ భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన

వైజాగ్, అక్టోబర్ 12 (ఈవార్తలు): దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ దక్షిణ బంగాళాఖాతం మీదుగా తమిళనాడు, శ్రీలంక తీరం వైపు కదులుతున్నందున దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి. దీని ప్రభావంతో ముఖ్యంగా అక్టోబర్ 14 నుంచి కోస్తాంధ్ర, తమిళనాడు తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 15న కూడా తీరం వెంబడి వర్షాలు కొనసాగుతాయని తెలుస్తోంది. అక్టోబర్ 16 నుంచి 19 మధ్య ఈ వర్షాలు క్రమంగా లోతట్టు ప్రాంతాలకు విస్తరించనున్నాయి. తమిళనాడులోని అంతర్గత ప్రాంతాలు, కేరళ, రాయలసీమ, దక్షిణ కర్ణాటక, కర్ణాటక తీర ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయి. కొన్ని చోట్ల పిడుగులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. తక్కువ సమయంలో తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో అక్కడక్కడా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశాన్ని కొట్టిపారేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ చివరి దశలో ఉన్నందున, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఈ వాతావరణ వ్యవస్థ ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి దోహదపడొచ్చని భావిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి 20 మధ్య కాలంలో ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశం లేనప్పటికీ, గణనీయమైన వర్షపాతాన్ని ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి

పొన్నం.. ఆధారాలు చూపించు: రాంచందర్ రావు



హైదరాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితా సవరణలో పేర్ల తొలగింపు అంశంపై ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ సవాల్ విసిరారు. ఓటర్ల జాబితాల సవరణపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఓట్ల తొలగింపుపై రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "రాంచందర్ రావు తేదీ, సమయం ప్రకటిస్తే.. ఓటు హక్కు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా ఆయన ముందుకే తీసుకొస్తాను" అని పొన్నం స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ ప్రక్రియలో పొరపాట్లు జరిగితే సరిదిద్దాల్సింది పోయి, బీజేపీ నేతలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. మంత్రి పొన్నం సవాల్‌పై స్పందించిన రాంచందర్ రావు... ఓట్లు తొలగించబడినట్టు చెబుతున్న ఒక 10 మందిని ఎన్నికల సంఘం కార్యాలయానికి తీసుకురావాలని ప్రతి సవాల్ విసిరారు. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలగగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఫసల్ బీమా యోజనలో చేరాలని ఈ ఏడాది మార్చిలోనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మొత్తంమీద, ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ చార్జీ తగ్గింపు!

త్వరలో కొత్త ధరలు ప్రకటిస్తామన్న మంత్రి పొన్నం



హైదరాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్ చార్జీలపై తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్‌కు రూ. 400 (మెట్రోకు రూ. 300, ఆర్టీసీకి రూ. 100), నెలవారీ పాస్‌కు రూ. 8,500 (మెట్రోకు రూ. 7,000, ఆర్టీసీకి రూ. 1,500) చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ ధరల నిర్ణయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన సూచన మేరకు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని చార్జీలను పునఃపరిశీలించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడమేనని, ప్రజలపై అదనపు భారం మోపడం తమ లక్ష్యం కాదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రయాణికుల అవసరాలు, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశమై అందరికీ అందుబాటులో ఉండేలా ధరలపై సరైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ పథకం ద్వారా ప్రయాణికులకు మేలు చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.

సర్‌తో బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారు

ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు



న్యూఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు–బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు–గిరిజనులు–బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

9 ఏళ్లుగా వితంతువుపై అత్యాచారం.. సీఐ అరెస్ట్

హైదరాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): పెళ్లి చేసుకుంటానని నమ్మించి, తొమ్మిదేళ్లుగా ఓ మహిళపై లైంగిక దాడికి పాల్పడిన ఆరోపణలపై హైదరాబాద్ పోలీసులు ఓ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌ను అరెస్ట్ చేశారు. ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్‌గా (డీఐ) పనిచేస్తున్న బాలస్వామిని సైదాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. భర్త మరణించి ఒంటరిగా ఉన్న మహిళను మోసం చేసిన ఈ ఘటన సంచలనం సృష్టిస్తోంది. నల్గొండ జిల్లాకు చెందిన మహిళకు 2008లో వివాహం కాగా, ఓ కుమారుడు ఉన్నాడు. 2015లో ఆమె భర్త ప్రమాదానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో, 2016లో ఓ పని మీద చంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆమెకు అప్పటి అడ్మిన్ ఎస్సై బాలస్వామితో పరిచయం ఏర్పడింది. తాను అవివాహితుడినని చెప్పి ఆమెకు దగ్గరయ్యాడు. త్వరలోనే పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో, అనారోగ్యంతో ఉన్న తన భర్త ఎక్కువ కాలం బతకరని వైద్యులు చెప్పిన నేపథ్యంలో ఆమె కూడా అంగీకరించింది. ఈ క్రమంలో వారిద్దరూ శారీరకంగా దగ్గరయ్యారు. కొంతకాలానికి బాలస్వామికి అప్పటికే పెళ్లయిన విషయం బాధితురాలికి తెలిసింది. దీనిపై నిలదీయగా.. భార్యతో గొడవలున్నాయని, విడాకులు తీసుకుని ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. బాధితురాలు అతడిని దూరం పెట్టడంతో, రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటానంటూ ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి మళ్లీ ఆమెను లొంగదీసుకున్నాడు. 2021లో బాధితురాలి భర్త మరణించడంతో, బాలస్వామి ఆమెతో సహజీవనం కొనసాగించాడు. అయితే 2025 జనవరి నుంచి ఆమెను దూరం పెట్టడం మొదలుపెట్టాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు, ఇన్నాళ్లుగా తనను శారీరకంగా వాడుకుని వదిలేశాడని ఆరోపిస్తూ సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు బాలస్వామిని అరెస్ట్ చేశారు. కాగా, బాలస్వామి గతంలో భవానీనగర్ ఎస్‌హెచ్‌వోగా ఉన్నప్పుడు కూడా మరో మహిళతో వివాదంలో చిక్కుకున్నారని, అప్పుడు కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో అతడిని ఖైరతాబాద్ డీఐగా బదిలీ చేశారని తెలుస్తోంది. తాజా ఘటనతో అతడిని సస్పెండ్ చేసే అవకాశాలున్నట్లు సమాచారం.

ఆమ్రపాలికి కీలక శాఖ

వైజాగ్, అక్టోబర్ 12 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేసింది. మొత్తం 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి కాటకు కీలకమైన పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జారీ చేసిన జీవో నెం.1985 ప్రకారం.. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆమ్రపాలిని యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో ప్రభుత్వ కార్యదర్శిగా నియమించారు. ఆమె ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న 1992 బ్యాచ్ అధికారి షంషేర్ సింగ్ రావత్‌కు రిపోర్ట్ చేయనున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సౌరభ్ గౌర్‌ను న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమించారు. 2006 బ్యాచ్ అధికారి డి. మురళీధర్ రెడ్డికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇప్పటివరకు ఆ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.ఎం. నాయక్‌కు బాధ్యతల నుంచి ఉపశమనం లభించింది.



పెద్ద శేషవాహనంపై శ్రీవారి దర్శనం

తిరుమల, అక్టోబర్ 12 (ఈవార్తలు): శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు శ్రీగోవిందరాజస్వామి అలంకారంలో ఏడుతలల స్వర్ణ శేషవాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద శేషవాహనంపై స్వామివారి ఊరేగింపు వైభవంగా సాగింది. ఆదిశేషుడు తన పడగల నీడలో శ్రీహరిని సేవిస్తూ దాస్యభక్తిని చాటుతాడని ఆలయ అర్చకులు తెలిపారు. రామావతారంలో లక్ష్మణుడిగా, ద్వాపరయుగంలో బలరాముడిగా శ్రీమన్నారాయణుడికి ఆదిశేషుడు సన్నిహితుడిగా ఉన్నాడని పేర్కొన్నారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం చిన్న శేషవాహనంపై, రాత్రి హంస వాహనంపై శ్రీమలయప్పస్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఒంటరి వృద్ధులకు ఊరట

పిల్లలు విదేశాల్లో స్థిరపడుతుంటే..తల్లిదండ్రులు మాత్రం భారత్‌లోని స్వస్థలాల్లోనే మిగిలిపోతున్నారు. పెద్ద ఇళ్లల్లో ఇద్దరే ఉంటున్న వృద్ధ దంపతులు,అత్యవసర సమయంలో ఆస్పత్రికి తీసుకెళ్లేవారు లేక ఇబ్బంది పడుతున్న వారు, రోజువారీ పనులకు సాయం అవసరమవుతున్న వారు పెరుగుతున్నారు. దీంతో సంప్రదాయ వృద్ధాశ్రమాలకు తోడు 'సీనియర్ లివింగ్ కమ్యూనిటీలు' కొత్తగా అందుబాటులోకి వస్తున్నాయి. ఇది ఇప్పుడు సామాజిక మార్పుతో పాటు కొత్త రియల్ ఎస్టేట్ మార్కెట్‌గా మారుతోంది. 2030 నాటికి ఈ మార్కెట్ రూ.1 లక్ష కోట్లను దాటే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ సంస్థ 'కొలియర్స్' అంచనా. 2025 నుంచి ఇప్పటివరకు సీనియర్ లివింగ్ ప్రాజెక్టుల కోసం డెవలపర్లు, ఆపరేటర్లు, పెట్టుబడిదారులు రూ.13 వేల కోట్లకు పైగా పెట్టుబడులను ప్రకటించారు. వచ్చే మూడునాలుగేళ్లలో 75 వేల కొత్త యూనిట్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ సంస్థలతో పాటు ఆరోగ్య సేవల సంస్థలు, సంస్థాగత పెట్టుబడిదారులు కూడా ఈ రంగంలోకి వస్తున్నారు. ప్రస్తుతం టైర్--1 నగరాల్లో ఎక్కువగా ఉన్న ఈ రంగం ఇప్పుడు చిన్న నగరాలు, ఆధ్యాత్మిక కేంద్రాల వైపు విస్తరిస్తోంది. కొత్త ప్రాజెక్టుల్లో 30--40 శాతం టైర్--2, టైర్--3 నగరాలు, ఆధ్యాత్మిక కేంద్రాల్లో రావచ్చని కొలియర్స్ అంచనా వేసింది. తిరుపతి, అయోధ్య, విశాఖ వంటి కేంద్రాలను సీనియర్ హౌసింగ్‌కు అనుకూల ప్రాంతాలుగా పేర్కొంది. హైదరాబాద్ వంటి నగరాలపై విదేశాల్లోని భారతీయుల ఆసక్తి కూడా పెరుగుతోంది. కొత్తగా వస్తోన్న సీనియర్ లివింగ్ ప్రాజెక్టులు సాధారణ వృద్ధాశ్రమాలకు భిన్నంగా ఉంటున్నాయి. 1, 2, 3 బీహెచ్‌కేలు, విల్లాలు, కమ్యూనిటీ హాళ్లు, భోజనం, హౌస్‌కీపింగ్, ఫిట్‌నెస్, వైద్య సేవలు, అత్యవసర స్పందన, ఫిజియోథెరపీ వంటి సదుపాయాలు అందిస్తున్నారు. స్వతంత్రంగా జీవించగలిగేవారికి 'ఇండిపెండెంట్ లివింగ్', అదనపు వైద్యం లేదా రోజువారీ సహాయం అవసరమైన వారికి 'అసిస్టెడ్ లివింగ్' విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. కొలియర్స్ 2026 నివేదిక ప్రకారం..దేశంలో ప్రస్తుతం సీనియర్ హౌసింగ్‌కు 20--22 లక్షల యూనిట్ల డిమాండ్ ఉంది. కానీ ఆర్గనైజ్డ్ సీనియర్ లివింగ్ రంగంలో అందుబాటులో ఉన్నవి 25 వేల యూనిట్లే. అంటే డిమాండ్‌లో కేవలం 1.3% మేరే వ్యవస్థీకృత సీనియర్ లివింగ్ సౌకర్యాలున్నాయి. 2030 నాటికి సీనియర్ హౌసింగ్ అవసరం 30 లక్షల యూనిట్లకు చేరుతుందని కొలియర్స్ అంచనా. అప్పటికి ఆర్గనైజ్డ్ సప్లై లక్ష యూనిట్లకు పెరగొచ్చని చెబుతోంది. తల్లిదండ్రుల భద్రత, వైద్యం, సామాజిక జీవనం కోసం సీనియర్ లివింగ్‌ను ప్రత్యామ్నాయంగా చూస్తున్నారని కొలియర్స్ నివేదిక పేర్కొంది. పిల్లలు విదేశాల్లో స్థిరపడటం, ఉమ్మడి కుటుంబాల తగ్గుదల, ఆయుర్దాయం పెరగడం, వృద్ధుల సంఖ్య పెరగడం.. ఇవన్నీ కలిసి "సీనియర్ లివింగ్ కమ్యూనిటీ"లకు డిమాండ్ పెంచుతున్నాయి.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

శ్రీవారి భక్తుల కోసం 'వెంకటాద్రి' యాప్



విజయవాడ, అక్టోబర్ 12 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఓ శుభవార్త అందించింది. కొండపైకి వచ్చే యాత్రికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా క్యూలైన్లు, వసతి గదులు, అన్నప్రసాద కేంద్రాలు వంటి ముఖ్యమైన ప్రదేశాలను సులభంగా చేరుకునేందుకు 'వెంకటాద్రి' పేరుతో ఒక నూతన నావిగేషన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్ ప్రత్యేకత ఏమిటంటే, కొండపై ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోయినా ఆఫ్‌లైన్, జీపీఎస్ విధానంలో పనిచేస్తుంది. తెలుగుతో సహా ఐదు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్‌లో, భక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు ఏఐ ఆధారిత 'గోవింద' వాయిస్ అసిస్టెంట్ సదుపాయం కూడా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది లొకేషన్‌ను ట్రాక్ చేసే సౌకర్యం కల్పించారు. ఆపిల్ యాప్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్ల నుంచి దీనిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ వెంకటాద్రి యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన మరిన్ని కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా), టీటీడీ సంయుక్తంగా చేపట్టనున్న రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుపతిని ఒక ఆదర్శ ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

సర్.. ఓట్ల దొంగతనమే : మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో భారీ నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని ఆరోపిస్తూ, సుప్రీంకోర్టు వరకు మార్చ్ చేస్తామని ఈ సందర్భంగా నేతలు హెచ్చరించారు. ఏఐసీసీ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ ను అడ్డుపెట్టుకుని, తమకు వ్యతిరేకంగా ఉన్న అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తోందని, ఇది ఓట్ల దొంగతనమేనని తీవ్రంగా విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఈసీని పదవి నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. హిందుస్థాన్ టైమ్స్, పీటీఐ కథనాల ప్రకారం, సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారని రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ఓట్లు తొలగించడం దారుణమని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 'ఓట్ బచావో, దేశ్ బచావో' నినాదంతో ఈ దేశవ్యాప్త ఆందోళనను కాంగ్రెస్ ఉద్ధృతం చేసింది.

సబ్‌స్టేషన్ పనులు వేగవంతం చేయాలి: ఎస్పీడీసీఎల్ సీఎండీ

కథలాపూర్, అక్టోబర్ 12 (ఈవార్తలు): 220 కేవీ కథలాపూర్ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులను వేగవంతం చేసి 2027 జనవరి 10 నాటికి పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. పనుల్లో జాప్యం లేకుండా అదనపు కార్మికులను నియమించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. రైతులు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని, కాలిపోయిన పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లను త్వరగా మార్చాలని ఆదేశించారు. అదనపు మోటార్ల వినియోగం వల్ల కలిగే ప్రభావాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం 132 కేవీ కోరుట్ల విద్యుత్ ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు హనుమయ్య, సంపత్, గంగారం, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



అటవీ శాఖకు జింక అప్పగింత

బీర్పూర్, అక్టోబర్ 12 (ఈవార్తలు): బీర్‌పూర్ గ్రామానికి చెందిన మాటేటి రాజన్న మేకల మందతో వచ్చిన జింకను గుర్తించి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. మేకల మందలో జింకను గుర్తించిన రాజన్న విషయాన్ని గ్రామ సర్పంచ్ ఎనుమట్ల హరీశ్‌కు తెలిపారు. అనంతరం సర్పంచ్‌తో కలిసి అటవీ శాఖ అధికారులకు జింకను అప్పగించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు చంద్రారెడ్డి, ప్రకాశ్, ఆనందరావు, నవీన్, గోపీనాథ్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



రోళ్లవాగు ప్రాజెక్టులోకి నీరు విడుదల చేయాలి

ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్‌కు మాజీ మంత్రుల లేఖ

జగిత్యాల, అక్టోబర్ 12 (ఈవార్తలు): ఖరీఫ్ పంటలను కాపాడేందుకు రోళ్లవాగు ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయాలని కోరుతూ బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు. రోళ్లవాగు ప్రాజెక్టు నిల్వ సామర్థ్యాన్ని 0.25 టీఎంసీ నుంచి ఒక టీఎంసీకి పెంచే పనుల్లో అటవీ అనుమతుల జాప్యం జరుగుతోందని వారు తెలిపారు. దీంతో కనీస స్థాయిలోనూ నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. బీర్‌పూర్, ధర్మపురి మండలాల రైతులు పంటలపై ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కాకతీయ కాలువ ద్వారా పది రోజుల పాటు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో డీ-53-12ఎల్ పంపిణీ కాలువ ద్వారా రోళ్లవాగు ప్రాజెక్టులోకి నీటిని మళ్లించాలని కోరారు. కనీసం 0.25 టీఎంసీల నీటిని నింపితే ఖరీఫ్ పంటలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



ఖమ్మం, అక్టోబర్ 12 (ఈవార్తలు): గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని శానిటేషన్, రోగుల సంరక్షణ, భద్రతా సిబ్బంది, పర్యవేక్షకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్పీఎస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు బత్తుల మమత ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో వైద్య విభాగం అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. సత్తుపల్లి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్, రోగుల సంరక్షణ, భద్రతా సిబ్బంది, పర్యవేక్షకులు చాలాకాలంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. 2022 జీవో నంబర్ 60 ప్రకారం కనీస వేతనం రూ.15,600 ఉండగా, పీఎఫ్, ఈఎస్ఐ మినహాయింపుల అనంతరం రూ.12,093 చెల్లించాల్సి ఉందన్నారు. అయితే ఆయా ఆస్పత్రుల్లో కాంట్రాక్టర్లు రూ.10,500 మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల వేతనాలు ఇప్పటివరకు అందలేదని తెలిపారు. వేతనాలపై స్థానిక అధికారులు, కాంట్రాక్టర్లను ప్రశ్నిస్తే పైస్థాయి నుంచి బిల్లులు రాలేదని చెబుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని వైద్య విద్యా సంచాలకులు, ఆరోగ్య కమిషనర్ కార్యాలయాల్లో ఆరా తీయగా, ప్రతి నెలా వేతనాలు చెల్లిస్తున్నామని అధికారులు తెలిపారని అన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించకపోతే పెద్ద ఎత్తున సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు చాగంటి నాగమణి, ఖమ్మం జిల్లా ప్రచార కార్యదర్శి బంక చక్రయ్యతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

6 వేల మందికి పైగా తెలంగాణ ప్రవాసుల సందడి



జగిత్యాల, అక్టోబర్ 12 (ఈవార్తలు): ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దుబాయ్‌లోని షబాబ్ అల్ అహ్లీ క్రీడా ప్రాంగణంలో 16వ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 6 వేల మందికి పైగా తెలంగాణ ప్రవాసులు పాల్గొన్నారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిథులుగా, దుబాయ్ కాన్సుల్ జనరల్ డాక్టర్ ఇమ్మడి విష్ణువర్ధన్‌రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి గౌరీదేవికి పూజలు నిర్వహించారు. సంప్రదాయ పాటలు, కోలాటాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. గాయని మధుప్రియతో పాటు పలువురు కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. చిన్నారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సిరిసిల్ల చేనేత కళాఖండం ప్రత్యేక ఆకర్షణ: రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ వెండి పట్టు దారాలతో ముగ్గురు పాలకుల ముఖచిత్రాలను వస్త్రంపై రూపొందించారు. రెండు మీటర్ల పొడవైన ఈ కళాఖండం తయారీకి 26 గ్రాముల వెండిని వినియోగించారు. దీనిని దుబాయ్ పాలక కుటుంబానికి అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2011 నుంచి యూఏఈలో బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటం, ప్రవాసుల ఐక్యతను పెంపొందించడం, భావితరాలకు తెలంగాణ వారసత్వాన్ని పరిచయం చేయడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.



నూకాలమర్రిలో సిబ్బందికి బతుకమ్మ కానుకలు

వేములవాడ అర్బన్, అక్టోబర్ 12 (ఈవార్తలు): నూకాలమర్రి గ్రామంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సహాయకులకు బతుకమ్మ పండుగ సందర్భంగా రోమాల ప్రవీణ్ ఆధ్వర్యంలో చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సింగిల్‌విండో చైర్మన్ వకుళాభరణం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సేవలందిస్తున్న సిబ్బందిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బతుకమ్మ కానుకలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాలకుర్తి పరశురాములు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సామల్ల రాజు, ఉపసర్పంచ్ పాలకుర్తి శంకరయ్య, మాజీ ఎంపీటీసీ బొద్దు రాములు, మాజీ సర్పంచ్ పిట్టల వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి పొట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల బీజేపీ ధార్మిక విభాగం నూతన కార్యవర్గం



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 12 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం పార్టీ ధార్మిక విభాగం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా ధార్మిక విభాగం కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర కన్వీనర్ సూర్య ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి హాజరయ్యారు. జిల్లాలోని 13 మండలాలు, రెండు మున్సిపాలిటీలకు ధార్మిక విభాగం అధ్యక్షులు, సహ కన్వీనర్లను నియమించారు. నూతనంగా నియమితులైన వారికి నాయకులు నియామక పత్రాలు అందజేశారు. ఆలయాల పరిరక్షణ, ధార్మిక సంప్రదాయాల ప్రచారం, పురాతన ఆలయాలు, వాటి ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలని నాయకులు సూచించారు. వేములవాడ పట్టణ మండలంలో అత్యధిక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించినందుకు మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్‌తో పాటు ధార్మిక విభాగం నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహ కన్వీనర్లు నవీన్‌కుమార్, భోగ రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా ధార్మిక విభాగం సహ కన్వీనర్లు బొమ్మాడి స్వామి, గొట్టే రామచంద్రం, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్ సాబీర్, మీడియా కన్వీనర్ కాసుగంటి రాజురావు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఇస్మాయిల్ ఉద్దీన్ ఎంపిక

జగిత్యాల, అక్టోబర్ 12 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని దారుల్ హసనాత్ పబ్లిక్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న సయ్యద్ ఇస్మాయిల్ ఉద్దీన్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 10న జగిత్యాలలోని పొన్నాల గార్డెన్‌లో నిర్వహించిన 70వ పాఠశాల క్రీడల సమాఖ్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీల్లో ఇస్మాయిల్ ప్రతిభ కనబరిచాడు. అండర్-14, అండర్-17 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో బాక్సింగ్‌లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇస్మాయిల్ ఎంపికపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



నూతన దుకాణాలు, సిబ్బంది వసతి గృహం ప్రారంభం

కూకట్‌పల్లి, అక్టోబర్ 12 (ఈవార్తలు): శంషిగూడ, హైదర్‌నగర్ డివిజన్ల పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహననగర్ సమాజ భవనం ప్రాంగణంలో నిర్మించిన నూతన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సిబ్బందికి వసతి సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. నూతన వసతి గృహం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంటీ శాతవాహననగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.రత్నప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఎం.యాదిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు వి.వెంకటరావు, ఎస్.రామనాథం, గృహ నిర్మాణ సంఘం, ఉమామహేశ్వర ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

VANGS GLOBAL TECHNOLOGIES LLP

DASARA SPECIAL OFFER

Launch Your Cloud-Hosted ePaper Today

Powering modern newsrooms with AI-powered image extraction & multi-language support

ePaper Pro దసరా శుభాకాంక్షలు

20% OFF ON EVERY PLAN

NEWS ONLY website · web stories · breaking news

Standard 5 GB · 5 users — SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Web stories, gallery, headlines
✓ Country & device-wise views
₹8,124 ₹6,499
20% OFF · SAVE ₹1,625 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹12,499 ₹9,999
20% OFF · SAVE ₹2,500 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹16,249 ₹12,999
20% OFF · SAVE ₹3,250 / YEAR

ePAPER ONLY PDF to Interactive ePaper

Standard 5 GB · 5 users — SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Unlimited pageviews & SEO
✓ Country & device-wise views
₹9,999 ₹7,999
20% OFF · SAVE ₹2,000 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
✓ Android app & email support
✓ Drag & drop theme builder
✓ Employee ID card design
✓ Custom domain & push alerts
₹14,999 ₹11,999
20% OFF · SAVE ₹3,000 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Custom domain & push alerts
₹19,999 ₹15,999
20% OFF · SAVE ₹4,000 / YEAR

NEWS + ePAPER the complete digital newspaper

Standard 5 GB · 5 users — SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Web stories, gallery, headlines
✓ Country & device-wise views
₹17,499 ₹13,999
20% OFF · SAVE ₹3,500 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹22,499 ₹17,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

Full Press 15 GB · 30 users — BEST VALUE
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹32,499 ₹25,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

PLATFORM HIGHLIGHTS
◆ Smart AI image extraction
◆ AdSense & sponsor ad slots
◆ Custom domain + auto SSL
◆ One-click publishing
◆ WhatsApp sharing
◆ AI tagging & SEO tags
◆ Real-time analytics
◆ AWS cloud - daily backups
◆ YouTube Video embedding

Try free for 12 days
No credit card required - Turn your print edition into a digital publication
CALL / WHATSAPP +91 7675087378
EMAIL hr@vangstechnologies.com
WEBSITE www.vangstechnologies.com
SCAN TO VISIT OUR WEBSITE
SCAN TO CALL +91 7675087378

సీజేఐ రాజీనామా చేయాలని
కాంగ్రెస్ పోస్ట్.. డిలీట్

తిరువనంతపురం: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ కేరళ విభాగం చేసిన పోస్టు రాజకీయ దుమారం రేపింది. విమర్శలు వెల్లువెత్తడంతో కొన్ని గంటలకే ఆ పోస్టును తొలగించింది. ఢిల్లీలో జరుగుతున్న నిరసనలు శాంతిభద్రతలకు సంబంధించిన అంశమని, అది తన పరిధిలోకి రాదని సీజేఐ వ్యాఖ్యానించడంపై కాంగ్రెస్ ఈ విధంగా స్పందించింది. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో కాంగ్రెస్ కేరళ విభాగం స్పందిస్తూ.. "జస్టిస్ సూర్యకాంత్ గారూ.. శాంతిభద్రతలు మీ పరిధిలో లేకపోతే వెంటనే రాజీనామా చేయండి. ఆ బాధ్యతలు నిర్వహించగల వ్యక్తిని మేం వెతుక్కుంటాం" అని పేర్కొంది. ఈ వ్యాఖ్యలపై బీజేపీ కేరళ విభాగం తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ న్యాయవ్యవస్థను బెదిరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. ఎమర్జెన్సీ రోజులను ప్రస్తావిస్తూ.. అప్పట్లో న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకొచ్చిన రోజులు ముగిశాయని బీజేపీ పేర్కొంది. ప్రధాని మోదీ నాయకత్వంలోని నూతన భారతదేశంలో అలాంటి ప్రయత్నాలు సాగవంటూ 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఇరు పార్టీల మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు దారితీసింది.



సౌదీకి అమెరికా మద్దతు!?
ప్రత్యక్ష సైనిక చర్య చేపట్టే చాన్స్?

రియాద్: పశ్చిమాసియాలో ఇప్పటికే రగులుతున్న యుద్ధాగ్ని మరింత విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. సౌదీ అరేబియాపై హూతీల దాడులు.. యెమెన్‌లో సౌదీ మద్దతుతో జరుగుతున్న సైనిక చర్యలు.. అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగే అవకాశాలు.. ఈ పరిణామాలన్నీ ప్రాంతీయ సంక్షోభాన్ని మరో స్థాయికి తీసుకెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. సౌదీపై దాడులతో మొదలైన తాజా ఉద్రిక్తత.. అమెరికా, టర్కీ, పాకిస్థాన్‌లనూ ఈ ఘర్షణలోకి లాగుతుందా? అన్న ఆందోళనలు పెరుగుతున్నాయి. సౌదీ రాజధాని రియాద్‌లోని ప్రధాన విమానాశ్రయంపై శనివారం జరిగిన దాడిలో 12 మంది మరణించగా, దాదాపు 300కు పైగా మంది గాయపడ్డారు. ఆదివారం మరో దాడిలో ఒకరు మరణించగా, 11 మంది గాయపడ్డారు. ఈ దాడులకు తామే బాధ్యులమని హూతీలు ప్రకటించారు. యెమెన్ రాజధాని సనాపై సౌదీ దాడులకు ప్రతిస్పందనగానే వీటిని చేపట్టినట్లు పేర్కొన్నారు. యెమెన్‌లో కీలక ప్రాంతాలపై హూతీలు పట్టు సాధించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎర్ర సముద్రం దక్షిణ ద్వారం వద్ద ఉన్న 'బాబ్ అల్ మండెబ్' జలసంధి సమీపంలో హూతీలు భూభాగాలను ఆక్రమించారు. ప్రపంచ వాణిజ్య నౌకాయానానికి ఈ మార్గం అత్యంత కీలకం. దీంతో యెమెన్ ప్రభుత్వ దళాలు ఎదురుదాడి ప్రారంభించాయి. వాటికి సౌదీ యుద్ధవిమానాలు మద్దతిస్తున్నాయి. హూతీల అధీనంలోని మొఖా ఓడరేవును తిరిగి స్వాధీనం చేసుకున్నామని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో హూతీలు సౌదీపై దాడులను తీవ్రతరం చేస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. సౌదీపై దాడుల్లో ఓ అమెరికా పౌరుడు మరణించడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఒత్తిడి పెరుగుతోంది. హూతీలపై అమెరికా దాడులు చేపడుతుందా? అని ప్రశ్నించగా.. ఆ అవకాశాన్ని పరిశీలిస్తామని ట్రంప్ చెప్పారు. సౌదీకి ప్రత్యక్ష సైనిక సహాయం, గగనతల రక్షణ వ్యవస్థల బలోపేతం, నిఘా సమాచారాన్ని పంచుకోవడం వంటి చర్యలు అవసరమని అమెరికా నిఘా విభాగంలో పనిచేసిన విలియం ఉషర్ అభిప్రాయపడ్డారు. అయితే ఇరాన్‌తో ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చూడాలన్నది వాషింగ్టన్ ముందున్న సవాలు.

అమెరికన్ల నెత్తిన అప్పులు
15 ఏళ్ల గరిష్ఠానికి రుణ ఎగవేతలు!

వాషింగ్టన్: అమెరికన్ కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఆదాయం, సంపద పెరుగుతున్నప్పటికీ, అధిక వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం కారణంగా అప్పుల భారం తీవ్రమవుతోంది. 2025 చివరి నాటికి, ప్రతి ఐదు అమెరికన్ కుటుంబాల్లో ఒకటి (దాదాపు 20%) రుణ చెల్లింపుల్లో వెనుకబడినట్లు తేలింది. 2007-08 ఆర్థిక మాంద్యం తర్వాత 2010లో నమోదైన స్థాయికి మించి, రుణ ఎగవేతలు ఇంతటి గరిష్ఠ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ఫెడరల్ రిజర్వ్ తాజాగా విడుదల చేసిన 2025 సర్వే ఆఫ్ కన్స్యూమర్ ఫైనాన్సెస్ (ఎస్‌సీఎఫ్) నివేదిక ఈ చేదు వాస్తవాలను వెల్లడించింది. 2022లో రుణ చెల్లింపుల్లో వెనుకబడిన కుటుంబాల వాటా సుమారు 12 శాతంగా ఉండగా, మూడేళ్లలో ఇది 20 శాతానికి చేరింది. రెండు నెలలకు పైగా చెల్లింపులు చేయని వారి సంఖ్య 5 శాతం నుంచి 8 శాతానికి పైగా పెరిగింది. తమ ఆదాయంలో 40 శాతానికి పైగా రుణాలకే చెల్లించే కుటుంబాల వాటా 6.5 శాతం నుంచి 8.6 శాతానికి పెరిగింది. ఇది 2013 తర్వాత ఇదే అత్యధికం. ఆశ్చర్యకరంగా, ఇదే సమయంలో అమెరికన్ల సగటు ఆదాయం ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత కూడా 7 శాతం పెరిగి 82,200 డాలర్లకు, సగటు నికర సంపద 2 శాతం పెరిగి 2,15,900 డాలర్లకు చేరుకుంది. అయితే, పెరిగిన వడ్డీ రేట్లు, అధిక ధరల పెరుగుదల వారి ఆనందాన్ని ఆవిరి చేశాయి. రుణాల చెల్లింపులు భారంగా మారడంతో ఆర్థిక ఒత్తిడి పెరిగింది. సుమారు 77 శాతం కుటుంబాలు ఏదో ఒక రూపంలో అప్పులు కలిగి ఉన్నాయి.

'ఫామ్ 6'పై నిర్ణయం తీసుకోలేదు: సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ: కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన కొత్త 'ఫామ్ 6' డిక్లరేషన్‌ను తాము ఆమోదించలేదని లేదా తిరస్కరించలేదని, అలాగే దాని చెల్లుబాటుపై ఇంకా నిర్ణయం తీసుకోవలసి ఉందని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. 2026 మే నాటి సర్ తీర్పు వెలువడిన సమయంలో కొత్త ఫామ్ 6 అందుబాటులో లేనందున దానిని ఆ తీర్పులో పరిశీలించలేదని చెప్పడమే ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యల ఉద్దేశమని న్యాయస్థానం పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వీ మోహనలతో కూడిన ధర్మాసనం భారత ఎన్నికల సంఘానికి(ఈసీఐ) ప్రియా మిశ్రా అనే వ్యక్తి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. కొత్త 'ఫామ్ 6'ను సుప్రీంకోర్టు సమర్థించిందన్న ఈసీఐ వాదనను ప్రధాన న్యాయమూర్తి గత వారం తోసిపుచ్చారని పిటిషనర్ తరపు న్యాయవాది నరేంద్ర మిశ్రా పేర్కొన్నారు. దీనికి జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ కొత్త 'ఫామ్ 6'పై ఎటువంటి నిర్ణయం జరగలేదు అని అన్నారు.



సూరత్, విశాఖ ఐటీఐల
అభివృద్ధికి 440 కోట్లు

పీఎం-సేతు కింద ఏఎం/ఎన్ఎస్ ఇండియాతో షేర్‌హోల్డర్ ఒప్పందాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: పీఎం-సేతు పథకం కింద గుజరాత్‌లోని సూరత్, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం క్లస్టర్లలో ప్రభుత్వ ఐటీఐల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (ఏఎం/ఎన్ఎస్ ఇండియా) మధ్య షేర్‌హోల్డర్ ఒప్పందాలు (ఎస్‌హెచ్ఏ) కుదిరాయి. ఈ ఒప్పందాల ద్వారా రెండు క్లస్టర్లలోని తొమ్మిది ప్రభుత్వ ఐటీఐలను ఆధునికీకరించనున్నారు. సూరత్ క్లస్టర్‌లో ఐదు, విశాఖపట్నం క్లస్టర్‌లో నాలుగు ఐటీఐలు ఉన్నాయి. ఈ రెండు క్లస్టర్ల అభివృద్ధికి మొత్తం రూ.440 కోట్ల పెట్టుబడికి ఆమోదం లభించింది. ఇందులో సూరత్‌కు రూ.240 కోట్లు, విశాఖపట్నానికి రూ.200 కోట్లు కేటాయించారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక మంత్రిత్వశాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ (డీజీటీ), గుజరాత్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు, ఏఎం/ఎన్ఎస్ ఇండియా ఈ ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ప్రాజెక్టుల అమలు కోసం ప్రత్యేక ప్రయోజన సంస్థలను (ఎస్‌పీవీలు) ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఏఎం/ఎన్ఎస్ ఇండియాకు 51 శాతం, కేంద్ర ప్రభుత్వానికి 24.5 శాతం, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి 24.5 శాతం వాటా ఉంటుంది. ఏఎం/ఎన్ఎస్ ఇండియా తన విద్యా, సాంకేతిక భాగస్వామి న్యూ ఏజ్ మేకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నామ్‌టెక్)తో కలిసి ప్రాజెక్టులను అమలు చేయనుంది. ఐటీఐల్లో శిక్షణ వసతులు, వర్క్‌షాపులు, ప్రయోగశాలలను ఆధునికీకరించడంతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కొత్త విభాగాలు, సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెట్టనున్నారు. పాఠ్యాంశాల నవీకరణ, బోధకుల శిక్షణ, సామర్థ్య నిర్మాణం, విద్యార్థులకు ప్రయోగాత్మక శిక్షణ వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు. పీఎం-సేతు పరిధిలో ఇప్పటివరకు తొలి 14 వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికలకు (ఎస్ఐపీ) మొత్తం రూ.3,446 కోట్ల పెట్టుబడికి ఆమోదం లభించింది. అందులో ఏఎం/ఎన్ఎస్ ఇండియా ఆధ్వర్యంలోని సూరత్, విశాఖపట్నం క్లస్టర్ల పెట్టుబడి ముఖ్యమైనదిగా నిలిచింది. పీఎం-సేతు పథకం కింద దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐలను అభివృద్ధి చేయడంతో పాటు ఐదు జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థలను (ఎన్ఎస్‌టీఐ) బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకానికి మొత్తం రూ.60,000 కోట్ల పెట్టుబడిని కేటాయించింది.

సెన్సెక్స్ భారీ పతనం



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలతో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగింది. భారీ మార్కెట్ విలువ కలిగిన కంపెనీల షేర్లలో బలహీనత కనిపించడంతో మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 547.65 పాయింట్లు నష్టపోయి 71,924.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 157.10 పాయింట్లు తగ్గి 22,363.35 వద్ద ముగిసింది. ప్రారంభంలో సానుకూలంగా కదిలిన నిఫ్టీ, 22,600 స్థాయిని నిలబెట్టుకోలేకపోవడంతో అమ్మకాల ఒత్తిడికి లోనైందని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. నిఫ్టీకి తక్షణ మద్దతు 22,300-22,200 స్థాయిల మధ్య ఉందని నిపుణులు తెలిపారు. ఈ స్థాయి కిందకు దాటితే 22,000 వరకు పడిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు, మార్కెట్‌లో కోలుకోవడం కొనసాగాలంటే నిఫ్టీ తిరిగి 22,500-22,600 స్థాయిని అధిగమించాల్సి ఉంటుందని అంచనా వేశారు. నిఫ్టీలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్, ఐటీసీ, టెక్ మహీంద్రా షేర్లు అత్యధికంగా నష్టపోయిన వాటిలో నిలిచాయి. రంగాల వారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల సూచీలు ఎక్కువగా పడిపోయాయి. అయితే మీడియా, కెమికల్స్ రంగాల షేర్లు లాభాలతో ముగిశాయి. ప్రధాన సూచీలు నష్టాల్లో ఉన్నప్పటికీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కొంత మెరుగైన పనితీరు కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.08 శాతం పెరగ్గా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 1.42 శాతం లాభపడింది. రెండో త్రైమాసిక ఫలితాలపై ఆశలు మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లకు మద్దతిచ్చాయని విశ్లేషకులు పేర్కొన్నారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, సౌదీ అరేబియా సహా ప్రాంతీయ ఇంధన మౌలిక సదుపాయాలపై హూతీ దాడుల కారణంగా ముడిచమురు సరఫరాకు అంతరాయం కలగవచ్చన్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. మరోవైపు విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు పెద్ద కంపెనీల షేర్లపై ఒత్తిడి పెంచాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

సైనికుల కోసం 'భారత్ రైస్'
ఎఫ్‌సీఐతో ఆర్మీ ఒప్పందం



న్యూఢిల్లీ: రక్షణ దళాల కోసం 'భారత్ రైస్'ను ఇండియన్ ఆర్మీ లాంఛనంగా ప్రారంభించింది. సైనికుల రేషన్ నాణ్యతను మెరుగుపరచడం దీని లక్ష్యమని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సమక్షంలో 'భారత్ రైస్' సేకరణ, పంపిణీ కోసం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)తో ఆర్మీ ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. 'ఈ అత్యుత్తమ నాణ్యత గల బియ్యాన్ని, స్థానిక ఎఫ్‌సీఐ కేంద్రాల నుంచి ఆర్మీ డిపోలు సేకరించడానికి బదులుగా లడఖ్, ఈశాన్య ప్రాంతాలతో సహా అన్ని ఆర్మీ సరఫరా డిపోలకు నేరుగా పంపిణీ జరుగుతుంది' అని అధికార ప్రకటనలో పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో రక్షణ శాఖ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా బియ్యాన్ని మిల్లింగ్ చేసి, నాఫెడ్ ద్వారా సరఫరా చేస్తారని వెల్లడించారు. కాగా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ కార్యక్రమంలో మాట్లాడారు. సైనికుల కార్యాచరణ సంసిద్ధత కేవలం ఆయుధాలతోనే నిర్వచించలేమని తెలిపారు. అత్యంత కఠినమైన పరిస్థితులలో పనిచేస్తున్నప్పుడు వారి శారీరక, మానసిక ఆరోగ్యం, మనోధైర్యం, ఓర్పుపై కూడా ఆధారపడి ఉంటుందని చెప్పారు. అందుకే సైనికుల సంక్షేమం ఒక అప్రధానమైన విషయం కాదని, జాతీయ భద్రతలో అది అంతర్భాగమని అన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, పటిష్టమైన పరికరాలు, సంపూర్ణ శిక్షణ సైనికుల మనోధైర్యాన్ని పెంచుతుందని, ప్రతి సవాలును వారు ఎదుర్కొనేందుకు సిద్ధం చేస్తాయని ఆయన వివరించారు. అయితే కేంద్ర ప్రభుత్వం రెండు సంవత్సరాల కిందటే 'భారత్' బ్రాండ్ ఉత్పత్తులను ప్రారంభించింది. ఇప్పటికే సాధారణ ప్రజల కోసం ప్యాక్ చేసిన సబ్సిడీ బియ్యాన్ని 'భారత్ రైస్' పేరుతో అమ్మడం ప్రారంభించింది. అలాగే 'భారత్ ఆటా' 'భారత్ దాల్' బ్రాండ్లను కూడా విక్రయిస్తోంది.

భారత్‌లో అస్థిరతకు కుట్ర
సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం
సీనియర్ అడ్వకేట్ హరీశ్ సాల్వే



న్యూఢిల్లీ: భారతదేశంలో నిరసనల పేరుతో నేపాల్, బంగ్లాదేశ్‌లో మాదిరిగా అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సీనియర్ అడ్వకేట్, భారత మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో అశాంతిని రెచ్చగొట్టడంలో విదేశీ శక్తుల పాత్ర ఉండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. 'ఐఏఎన్ఎస్' వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని నిరసన కార్యక్రమాలకు విదేశాల నుంచి నిధులు అందుతున్నాయని తాను విశ్వసిస్తున్నట్లు సాల్వే తెలిపారు. ప్రభుత్వ పురోగతిని అడ్డుకోవడానికి కొన్ని గ్రూపులు ప్రయత్నిస్తున్నాయని, ప్రదర్శనల కోసం ఇంత డబ్బు ఎక్కడి నుంచి వస్తోందని ఆయన ప్రశ్నించారు. పొరుగు దేశాల్లో రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ.. "నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లో జరిగిన గందరగోళం వెనుక ఎవరున్నారనే దానిపై సందేహం ఉందా? నా అభిప్రాయం ప్రకారం, ఈ సంఘటనల వెనుక విదేశీ శక్తులు ఉన్నాయి" అని అన్నారు. భారత్‌లోనూ అలాంటి ధోరణే కనిపిస్తోందని, దీప్కే, సౌరవ్ దాస్ వంటి కొందరు ఆకస్మికంగా నిరసనలకు నాయకులుగా ముందుకొస్తున్నారని సాల్వే ఆరోపించారు. జర్మనీ వంటి దేశాల్లో నివసించే కొందరు ఇక్కడ ఎలా నాయకులుగా చలామణి అవుతున్నారని, ఈ కార్యకలాపాలకు వారికి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు.

నిరసన చేయాలంటే రూ.లక్ష ఫీజు

న్యూఢిల్లీ: ఇక ఢిల్లీలో నిరసన తెలపడం డబ్బుతో కూడుకున్న వ్యవహారం కానున్నది. జంతర్ మంతర్‌కు ప్రత్యామ్నాయంగా నిరసనల కోసం కేటాయించిన మూడు కొత్త ప్రదేశాలలో ఒకటైన రామ్‌లీలా మైదాన్ రానున్న రెండున్నర నెలల పాటు బుకింగ్‌కు అందుబాటులో లేదు. దీని బుకింగ్ రుసుము రోజుకు రూ.50,000. దీనికి అదనంగా రూ.55,000 సెక్యూరిటీ డిపాజిట్(తిరిగి వాపసు వస్తుంది) ఉంటుంది. పన్నులతో కలిపి ఒక రోజు బుకింగ్‌కు అయ్యే ప్రారంభ ఖర్చు రూ.1.21 లక్షలు అవుతుంది అని ఒక అధికారి తెలిపారు. మైదానంలో కేవలం 150 మందికి మాత్రమే చోటు ఉంటుందని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యానవన శాఖ ద్వారా ఈ మైదానాన్ని బుక్ చేసుకోవాలి. ఒక దరఖాస్తును ఆమోదించే ముందు ఢిల్లీ పోలీసుల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్ఓసీ) తప్పనిసరి అని అధికారులు చెప్పారు. జంతర్ మంతర్‌లో నిరసనలకు ఎటువంటి చెల్లింపు అవసరం లేదు.




మందుపాతర పేలి లష్కరే నలుగురు ఉగ్రవాదులు మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) దాటి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన నలుగురు ఉగ్రవాదులు మందుపాతరల పేలుడులో మరణించారు. వీరిలో లష్కరే తోయిబా కీలక కమాండర్ మహమ్మద్ ఫైజాన్ కూడా ఉన్నట్లు సమాచారం. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని నాంగి టెక్రి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన మందుపాతరలు పేలడంతో నలుగురూ అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. మిగిలిన ముగ్గురిని వకాస్, ఇస్తియాక్, ఆసిమ్‌గా గుర్తించారు. ఎల్ఓసీ వెంబడి భద్రతా బలగాలు ఇప్పటికే నిఘాను కట్టుదిట్టం చేశాయి. ఈ ఘటనతో అప్రమత్తమైన సిబ్బంది సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు, పర్యవేక్షణను మరింత పెంచారు. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని సత్వాల్-నాకి ప్రాంతంలో సోమవారం జీరో లైన్ సమీపంలో పేలుడు జరిగినట్లు అంతకుముందు సమాచారం అందింది. పాకిస్థాన్ వైపు ఎల్ఓసీ వెంబడి కదులుతున్న ఓ బృందం సమీపంలో అనుమానిత ఐఈడీ పేలినట్లు అధికారులు తెలిపారు. ఆ బృందంలో చొరబాటుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదులు ఉన్నారా? లేక గస్తీ నిర్వహిస్తున్న పాకిస్థాన్ భద్రతా సిబ్బందా? అన్నది తొలుత స్పష్టంకాలేదు. పేలుడుకు దారితీసిన పరిస్థితులపైనా అధికారులు ఆరా తీశారు.

144 ఏళ్ల తర్వాత బర్దాకు ఆసియా సింహాలు

అహ్మదాబాద్: గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతంలో ఉన్న బర్దా వన్యప్రాణుల అభయారణ్యంలో 144 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆసియా సింహాలు మళ్లీ అడుగుపెట్టాయి. ఒకప్పుడు సింహాల జాడలేని ఈ ప్రాంతం ఇప్పుడు 17 సింహాలతో కళకళలాడుతోంది. ఆసియా సింహాల సంరక్షణలో ఇదొక చారిత్రక విజయంగా పర్యావరణవేత్తలు అభివర్ణిస్తున్నారు. గిర్ అడవులకు మాత్రమే పరిమితమైన సింహాలకు, బర్దా అభయారణ్యం రెండో సురక్షిత ఆవాసంగా మారనుంది. 'బియాండ్ గిర్: బర్దా వైల్డ్‌లైఫ్ శాంక్చురీ యాజ్ ఏ పొటెన్షియల్ స్ట్రాంగ్‌హోల్డ్ ఫర్ ఏషియాటిక్ లయన్స్' పేరుతో ప్రఖ్యాత 'ప్లోస్ వన్' జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, బర్దా అభయారణ్యం సింహాల దీర్ఘకాలిక మనుగడకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని తేలింది. సుమారు 192.31 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంతంలో సింహాలకు అవసరమైన ఆహారం, సహజ ఆవాసం, పర్యావరణ పరిస్థితులు ఉన్నాయని ఈ అధ్యయనం నిర్ధారించింది.

లయకారి చిత్రం






బాలకృష్ణ నాకన్నా బెటర్‌గా డ్యాన్స్ చేస్తారట: లయ

అలనాటి అందాల తారా లయ ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్‌పై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు వచ్చిన అవకాశాలు అందుకుంటూ మరోసారి నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్న ఈ హీరోయిన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని నందమూరి నటసింహం బాలకృష్ణపై షాకింగ్ కామెంట్స్ చేసింది. 'బాలకృష్ణ గారికి నిజంగానే అంత కోపమా' అనే ప్రశ్నపై స్పందించిన ఈమె.. షూటింగ్‌లో జరిగిన ఓ షాకింగ్ సంఘటనను చెప్పుకొచ్చింది. ఈ మేరకు నందమూరి బాలకృష్ణతో కలిసి 'విజయేంద్ర వర్మ' సినిమాలో నటించిన అనుభవాలను హీరోయిన్ లయ పంచుకుంటూ.. 'బాలయ్యకు చాలా కోపమని బయట విని మొదట్లో భయపడేదాన్ని. కానీ ఆయనతో పనిచేశాక ఎంతో సరదాగా, ఆప్యాయంగా ఉంటారని అర్థమైంది. ఓ పాట షూటింగ్‌లో డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తుండగా పొరపాటున ఆయన కాలు తొక్కేశాను. దీంతో బాలయ్య ప్యాకప్ చెప్పి, నన్ను సినిమా నుంచి తీసేయమన్నట్లు మాట్లాడటంతో నిజంగానే భయపడి ఏడ్చేశాను. అది గమనించిన బాలయ్య వెంటనే నవ్వుతూ 'సరదాగా అన్నాను.. నిజమనుకోవద్దు' అని చెప్పారు. దాంతో కూల్ అయ్యాను. అంతేకాదు, డ్యాన్స్ చేసేటప్పుడు ఆయన నన్ను ఎంతో ప్రోత్సహించేవారు కొన్నిసార్లు నాకంటే బాగా చేస్తున్నావంటూ మెచ్చుకునేవారు' అంటూ ఆనాటి జ్ఞాపకాలను పంచుకుంది లయ.

'కరికాల' ప్రపంచంలోకి సాక్షి మడోల్కర్



ఇటీవల 'సిగ్మా'తో ప్రేక్షకులను పలకరించిన యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో సందీప్ కిషన్.. ఇప్పుడు 'కరికాల' అనే భారీ ఫాంటసీ అడ్వెంచర్ మూవీతో వచ్చేందుకు సిద్ధం అయ్యాడు. 'శంబాల' సినిమాతో హ్యాట్రిక్ హిట్ కొట్టిన డైరెక్టర్ యుగంధర్ ముని ఈ చిత్రాన్ని దర్శకత్వం వహిస్తుండగా.. సైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ పాన్ ఇండియా మూవీ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో 'కరికాల: చాప్టర్ 1'ను 2027 జూలై 2న, అలాగే 'కరికాల: చాప్టర్ 2'ను 2027 అక్టోబర్ 28న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ నుంచి వరుస అప్డేట్స్ ఇస్తున్నారు మేకర్స్. ఈ మేరకు ఇటీవల ఈ చిత్రంలో నటి కేథరిన్ నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించగా.. తాజాగా మరో బ్యూటీకి ఆహ్వానం పలికారు. ఈ మేరకు.. 'సాక్షి మడోల్కర్, సందీప్ కిషన్ 'కరికాల' చిత్రంతో భారీ ప్రాజెక్ట్‌లో అడుగుపెడుతున్నారు' అంటూ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేశారు. ప్రజెంట్ ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది.

త్వరలో రజనీకాంత్ బయోగ్రఫీ

సూపర్ స్టార్ రజనీకాంత్ అభిమానులకు ఒకేసారి రెండు శుభవార్తలు అందాయి. ఆయన ఆత్మకథ త్వరలో విడుదల కానుండగా, మరోవైపు ఆయన నటించిన 'జైలర్ 2' సినిమా విడుదలకు సిద్ధమైంది. ఏడుసార్లు జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ తమిళ గేయ రచయిత వైరముత్తు తాజాగా రజనీకాంత్‌తో జరిగిన భేటీ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రజనీ తన బయోగ్రఫీపై పనిచేస్తున్నారని, అది తమిళంతో పాటు ఇంగ్లీష్‌లోనూ విడుదలయ్యే అవకాశం ఉందని సూచించినట్లు తెలిపారు. 'జైలర్ 2' సినిమా విడుదల సందర్భంగా రజనీకి శుభాకాంక్షలు తెలిపేందుకు వెళ్లానని వైరముత్తు తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో తాము కళ, జీవితం గురించి మాట్లాడుకున్నామని, రాజకీయాల ప్రస్తావన రాలేదని స్పష్టం చేశారు. "మీ ఆత్మకథ ఎప్పుడు వస్తుంది?" అని తాను అడగ్గా, "పనులు జరుగుతున్నాయి, త్వరలోనే వస్తుంది" అని రజినీ బదులిచ్చారని వైరముత్తు వివరించారు. "చాలా మందికి చరిత్ర ఉంటుంది, కానీ మీకు చరిష్మా కూడా ఉంది, అందుకే మీ ఆత్మకథ కోసం అందరూ ఎదురుచూస్తున్నారు" అని తాను చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు.




రామాయణ వైభవం సినిమాల్లో కనిపించలేదు



ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, 'రామాయణం' వంటి భారతీయ ఇతిహాసాలను ఇప్పటివరకు సినిమాల్లో చూపించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. వెండితెరపై వాటిని ప్రదర్శించిన తీరు తనకు ఎప్పుడూ పూర్తి సంతృప్తినివ్వలేదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. పాత పౌరాణిక చిత్రాల్లో కొన్ని సన్నివేశాలు నచ్చినప్పటికీ, మూల గ్రంథాల్లోని వైభవాన్ని, కథలోని భారీతనాన్ని పూర్తిస్థాయిలో తెరపైకి తీసుకురాలేకపోయారని అభిప్రాయపడ్డారు. ఇతిహాసాలను రాసిన విధానానికి, వాటిని సినిమాలుగా మలిచిన తీరుకు మధ్య పెద్ద అంతరం ఉందని తాను గమనించినట్లు వివరించారు. ఈ అసంతృప్తే తనను ఓ సవాల్‌గా ముందుకు నడిపిస్తోందని, మహేశ్ బాబుతో తీస్తున్న 'వారణాసి' చిత్రానికి ఇదే మూలమని రాజమౌళి పేర్కొన్నారు. తన కెరీర్‌లోనే ఇది అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ అని, ఇతిహాసాలకు ఉండాల్సిన స్థాయి, వైభవం, ఉన్నతమైన భావోద్వేగాలను తెరపైకి తీసుకురావడమే తన బాధ్యత అని భావిస్తున్నట్లు చెప్పారు. 'వారణాసి' చిత్రంలో రామాయణం స్ఫూర్తితో కీలకమైన సన్నివేశాలు ఉంటాయని భావిస్తున్నారు. మహేశ్ బాబు సరసన ప్రియాంక చోప్రా జోనస్ నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాను 2027, ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అద్భుత అవకాశం దక్కింది



ప్రముఖ దర్శకుడు పా. రంజిత్ దర్శకత్వంలో వస్తోన్న తమిళ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ డ్రామా 'వెట్టువం'. ఆర్య, దినేష్‌తో పాటు టాలీవుడ్ బ్యూటీ శోభితా ధూళిపాళ ఇందులో కీలక పాత్రలో నటిస్తుంది. ఈ సినిమాలో శోభిత 'రథి' అనే పాత్ర కోసం మల్లఖంబం, కలరిపయట్టు వంటి సంప్రదాయ యుద్ధ కళల్లో కఠినమైన శిక్షణ కూడా తీసుకుంది. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ అమ్మడు వెట్టువం సినిమా గురించి చేసిన కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. 'ఈ సినిమా కోసం నేను నా సర్వస్వాన్ని నింపేశాను.. గతంలో కంటే చాలా ఎక్కువగా ఇదొక అత్యుత్తమమైనదని నేను భావిస్తున్నాను. అంటే మిగిలిన సినిమాలను తక్కువ చేస్తున్నా అని కాదు. రంజిత్‌తో కలిసి పనిచేయడం కూడా ఒక కారణం. విషయం ఏమిటంటే, 'మేడ్ ఇన్ హెవెన్' నుంచి, ఆ తర్వాత కొద్ది కాలం నేను ఒకే రకమైన పాత్రలను పోషిస్తున్నానని నాకు అనిపించి. అయితే.. ఈ సినిమాలో నా పాత్ర పూర్తిగా భిన్నంగా ఉంటుంది. పైకి కనిపించని, లోపల చాలా విషయాలు దాగి ఉన్న, ఉక్కులాంటి వెన్నెముక కలిగిన ఒక మహిళ పాత్ర ఇది. పైకి ఒక సౌందర్యం కనిపిస్తూ, లోపల నీటి అడుగున చాలా విషయాలు జరుగుతుంటాయి.



విజయ్ సార్ నా ఫేవరెట్ అయ్యారు

టాలీవుడ్ దంపతులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ ఆత్మీయ భేటీకి సంబంధించిన ఫొటోలను విజయ్ దేవరకొండ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకోగా, అవి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సమావేశంలో జీవితం, పని, ప్రపంచం గురించి చర్చించుకున్నట్లు ఆయన తెలిపారు. విజయ్ దేవరకొండ షేర్ చేసిన ఫొటోలలో, సీఎం విజయ్‌తో కలిసి విజయ్, రష్మిక నవ్వుతూ పోజులిచ్చారు. మరో ఫొటోలో ముగ్గురూ సరదాగా మాట్లాడుకుంటూ కనిపించారు. చివరి ఫొటోలో దేవరకొండ, సీఎం విజయ్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకోగా, రష్మిక వారిని చూసి నవ్వుతూ కనిపించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ తన ఆనందాన్ని పంచుకున్నారు. "ప్రియమైన దళపతి విజయ్ గారితో అద్భుతమైన సమయం గడిపాను. రోజంతా ఎంతో అలసిపోయినా, మమ్మల్ని ఎంతో ప్రేమతో ఆహ్వానించి మంచి జీవితం, పని, ప్రపంచం గురించి ఎన్నో వ్యక్తిగత విషయాలు పంచుకున్నారు. ఈ ఒక్క మీటింగ్‌తోనే సార్ నా ఫేవరెట్ అయిపోయారు. మళ్లీ కలిసే వరకు నా ప్రేమ, గౌరవం మీకు ఉంటాయి" అని తన పోస్టులో పేర్కొన్నారు. రష్మిక మందన్న కూడా ఈ భేటీపై స్పందిస్తూ, విజయ్‌పై తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేశారు. "చాలా కాలం తర్వాత విజయ్ సర్‌ను కలవడానికి వెళ్లాను. ఎప్పటినుంచో ఆయనకు అభిమానిగా ఉన్న నేను, ఆయనతో కలిసి పనిచేసే అవకాశం పొందాను. ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఆయనను చూసి ఆరాధిస్తున్నాను. ఆయన ప్రయాణం నమ్మశక్యం కానిది. మీకు ఎల్లప్పుడూ నా ప్రేమ, శుభాకాంక్షలు ఉంటాయి సార్!" అని రష్మిక రాసుకొచ్చారు.

బ్రేకప్ తర్వాతే అసలైన ఎదుగుదల



మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ తన గత ప్రేమాయణం, బ్రేకప్ గురించి మరోసారి స్పందిస్తూ సోషల్ మీడియాలో నెటిజన్ల దృష్టిని ఆకర్షించారు. కొద్ది రోజుల క్రితమే తన మాజీ ప్రియుడు ఎంతో విచిత్రంగా ప్రవర్తించేవాడని, తన వ్యక్తిగత విషయాలతో పాటు సినిమా కెరీర్‌ను కూడా కంట్రోల్ చేయడానికి ప్రయత్నించాడని చెబుతూ సంచలనం సృష్టించారు. తాజాగా, మరోసారి తన బ్రేకప్‌ను గుర్తు చేసుకుంటూ, జీవితంలో ఎదురైన ఆ చేదు అనుభవం గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా జీవితంలో ప్రేమ ఎంత అందంగా ఉంటుందో, ఇద్దరు వ్యక్తులు విడిపోవడం కూడా అంతే అందమైన విషయమని అనుపమ అభిప్రాయపడ్డారు. ఒక పార్ట్‌నర్‌తో విడిపోవడం అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక సహజమైన భాగమేనని ఆమె పేర్కొన్నారు. ఒక బంధం ముగిసిన తర్వాత ఆ వ్యక్తి నుంచి మనం ఎలా దూరమవుతామో, ఆ తర్వాత రోజుల్లో మనల్ని మనం ఎలా మెరుగుపరుచుకుని ఒక మంచి వ్యక్తిగా ఎదుగుతామో అనేది కేవలం ఆ విడిపోవడంతోనే మొదలవుతుందని ఆమె వెల్లడించారు. అందుకే తన కోణంలో చూస్తే బ్రేకప్ అనేది బాధ కాదని.. అది ఎంతో అందంగానే కనిపిస్తుందని స్పష్టం చేశారు. ప్రేమలో విఫలమైనప్పటికీ ధైర్యంగా నిలబడి, తన జీవితాన్ని మరింత అందంగా మలుచుకుంటున్న అనుపమ తీరును చూసి నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.



మాయా రాజేశ్వరన్ సంచలనం

సానియా మీర్జా 22 ఏళ్ల రికార్డు బ్రేక్

భారత టెన్నిస్‌లో ఓ కొత్త తార ఉదయించింది. 17 ఏళ్ల యువ క్రీడాకారిణి మాయా రాజేశ్వరన్ రేవతి తన తొలి ప్రొఫెషనల్ సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ఈ విజయంతో 22 ఏళ్ల క్రితం టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టింది. అయితే, సానియా మీర్జాతో పోలికను ఆమె సున్నితంగా తిరస్కరించింది. సానియా ఎప్పటికీ ఒక లెజెండ్ అని, తన ఆరాధ్య దైవమని స్పష్టం చేసింది. నైజీరియాలోని లాగోస్‌లో జరిగిన డబ్ల్యూ35 టోర్నమెంట్‌లో మాయా అద్భుత ప్రదర్శన కనబరిచింది. క్వాలిఫయర్‌గా బరిలోకి దిగి, మెయిన్ డ్రాలో ఒక్క సెట్ కూడా కోల్పోకుండా సింగిల్స్ టైటిల్ కైవసం చేసుకుంది. ఫైనల్‌లో స్పెయిన్ క్రీడాకారిణి సెలియా సెర్వినో రూజ్‌ను 6-4, 6-2 తేడాతో ఓడించి, డబ్ల్యూ35 టైటిల్ గెలిచిన అతి పిన్న వయస్కురాలైన భారతీయ మహిళగా నిలిచింది. అంతేకాకుండా, ఉక్రెయిన్‌కు చెందిన యెలిజవేటా కోట్లియార్‌తో కలిసి డబుల్స్ టైటిల్‌ను కూడా గెలుచుకుని డబుల్ ధమాకా సృష్టించింది. ఈ విజయం తన ప్రొఫెషనల్ కెరీర్‌లో కేవలం ఆరంభం మాత్రమేనని మాయా చెప్పింది. "ఇది నా ప్రొఫెషనల్ కెరీర్‌కు మంచి ఆరంభం. ఈ విజయం నాకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. రాబోయే టోర్నమెంట్లలో ఈ ఆత్మవిశ్వాసాన్ని కొనసాగిస్తాను" అని వివరించింది. సానియా మీర్జా గురించి మాట్లాడుతూ "ఆమె ఒక లెజెండ్, ఆమెను అధిగమించడం సాధ్యం కాదు. ఆమె వల్లే దేశంలో టెన్నిస్‌కు ఇంత గుర్తింపు వచ్చింది. నేను ఇప్పటికీ ఆమె ఇంటర్వ్యూలు, పాడ్‌కాస్ట్‌లు వింటాను" అని పేర్కొంది.

రివర్స్ స్వింగ్ అంటే సరదా: అర్ష్‌దీప్ సింగ్



డెత్ ఓవర్లలో బంతి రివర్స్ స్వింగ్ అవుతుంటే బౌలింగ్ చేయడం ఎప్పుడూ ఎంతో సరదాగా ఉంటుందని టీమిండియా యువ ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అన్నాడు. వెస్టిండీస్‌తో ఆదివారం ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో జరిగిన మూడో టీ20లో అర్ష్‌దీప్ చెలరేగి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో 14 పరుగుల తేడాతో గెలిచిన భారత్, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో 44 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టిన అర్ష్‌దీప్ సింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. 223 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో, ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే ప్రమాదకరమైన షాయ్ హోప్‌ను క్లీన్ బౌల్డ్ చేసి భారత్‌కు శుభారంభం అందించాడు. ఆ తర్వాత కమిల్ పూరన్, హెట్‌మైర్ రాణించినా, భారత బౌలర్లు కట్టడి చేశారు. చివర్లో షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ దూకుడుగా ఆడటంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. అయితే, డెత్ ఓవర్లలో బౌలింగ్‌కు వచ్చిన అర్ష్‌దీప్.. ఒక అద్భుతమైన యార్కర్‌తో రూథర్‌ఫర్డ్ మిడిల్ స్టంప్‌ను ఎగరగొట్టాడు. ఆ తర్వాత కీమో పాల్‌ను కూడా ఔట్ చేసి భారత్ విజయాన్ని ఖాయం చేశాడు. మ్యాచ్ అనంతరం అర్ష్‌దీప్ మాట్లాడుతూ "బంతి కాస్త రివర్స్ స్వింగ్ అయింది. అలాంటి సమయంలో డెత్ ఓవర్లలో బౌలింగ్ చేయడాన్ని నేను ఎంతో ఆస్వాదిస్తాను. అది నాకు చాలా సరదాగా అనిపిస్తుంది" అని తెలిపాడు.

అండర్-17 ఫుట్‌బాల్ ఆసియా కప్‌కు భారత అమ్మాయిలు

భారత అండర్-17 మహిళల ఫుట్‌బాల్ జట్టు చరిత్ర సృష్టించింది. వచ్చే ఏడాది జరగబోయే మహిళల ఆసియా కప్‌కు అర్హత సాధించింది. ఈ టోర్నీకి వరుసగా రెండోసారి అర్హత సాధించిన తొలి భారత జట్టుగా నిలిచింది. వయసు విభాగాల్లోనే కాదు సీనియర్ లెవల్‌లో కూడా బ్యాక్ టూ బ్యాక్ ఆసియా కప్‌కు క్వాలిఫై అయిన మొట్టమొదటి భారత జట్టు ఇదే. అండర్-17 ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి జరిగిన తమ చివరి గ్రూపు మ్యాచ్‌లో భారత్ 4-0 తేడాతో మలేసియాపై ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. దీంతో గ్రూపు-ఈలో ఇండియా టీమ్ 9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్ టోర్నమెంట్‌కు దూసుకొచ్చింది. క్వాలిఫయర్స్‌లో మొదటి నుంచి భారత్ ఆకట్టుకుంది. మూడు గ్రూపుల మ్యాచ్‌లకుగాను మూడింట గెలిచింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఇరాక్, సిరియాలను ఓడించింది. ఇక మలేసియాతో చివరి మ్యాచ్‌లోనూ సత్తాచాటింది. ఈ మ్యాచ్‌లోనూ స్పష్టమైన ఆధిపత్యం ఇండియాదే. భారీ వర్షం కారణంగా మైదానం బురదమయంగా మారింది. బంతిని పాస్ చేయడానికి ఇరు జట్లు కష్టపడ్డాయి. ఈ కఠిన పరిస్థితుల్లోనూ భారత దూకుడుగా ఆడింది. 28వ నిమిషంలో రిదిమా దేవి చింగ్‌ఖమాయుమ్ జట్టుకు తొలి గోల్ అందించింది. ఆ తర్వాత ప్రితీక బర్మాన్, అనుష్క కుమారి, నిధి వరుసగా చెరో గోల్ చేశారు. మలేసియా ఒక్క గోల్ కూడా చేయకపోగా భారత్ ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. ఈ ఏడాది జరిగిన అండర్-17 ఆసియా కప్‌లో భారత్ నాకౌట్ రౌండ్‌కు చేరుకుంది. అయితే, క్వార్టర్ ఫైనల్‌లో చైనా చేతిలో ఓడిపోయింది.



అడుగడుగునా భద్రత



2,200 మంది పోలీసులతో పహారా

రేపు ఉప్పల్‌లో విండీస్‌తో మ్యాచ్

ఈనెల 14న ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరగనున్న టీ20 మ్యాచ్ కోసం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లుగా మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి వెల్లడించారు. మైదానంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా 2,200 మంది పోలీస్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. మ్యాచ్ సందర్భంగా ఉప్పల్ స్టేడియం అంతటా, ప్రేక్షకుల రాకపోకలు సాగించే ప్రాంతాల్లో 408 సీసీటీవీ కెమెరాలను అమర్చారు. వీటికి తోడు ఆకాశ మార్గం నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు 2 ప్రత్యేక డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నారు. ఉప్పల్ స్టేడియం చుట్టూ 4 ప్రత్యేక వాచ్ టీమ్‌లను నిరంతర పహారా కోసం రంగంలోకి దించారు. మ్యాచ్ చూసేందుకు వచ్చే ప్రేక్షకుల సౌకర్యార్థం దాదాపు 8 వేల వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. మ్యాచ్ ప్రారంభ సమయానికి 2 గంటల ముందే స్టేడియం గేట్లను తెరిచి లోపలికి అనుమతి ఇస్తామని సీపీ సుమతి తెలిపారు. స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు, ప్రేక్షకుల సేఫ్టీ విషయంలో అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నారని, నిబంధనలను పాటించి పోలీసులకు సహకరించాలని ఆమె క్రీడాభిమానులను కోరారు.





2000 సిక్సర్ల క్లబ్‌లో విండీస్

అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో వెస్టిండీస్ సరికొత్త చరిత్ర సృష్టించింది. పొట్టి ఫార్మాట్‌లో 2,000 సిక్సర్లు బాదిన తొలి జట్టుగా చారిత్రక మైలురాయిని అందుకుంది. ఎప్పటినుంచో దూకుడైన బ్యాటింగ్‌కు మారుపేరుగా నిలిచిన కరేబియన్ జట్టు, ఈ అరుదైన ఘనతను తమ ఖాతాలో వేసుకుంది. భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో 13 సిక్సర్లు బాదడం ద్వారా ఈ రికార్డును నెలకొల్పింది. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు వెస్టిండీస్ జట్టు 1,997 సిక్సర్లతో 2000 మార్కుకు అత్యంత చేరువలో ఉంది. మ్యాచ్‌లో ఆ జట్టు బ్యాటర్లు తమదైన శైలిలో చెలరేగి 13 సిక్సర్లు కొట్టి, ఈ చారిత్రక ఘనతను అందుకున్నారు. క్రిస్ గేల్, కీరన్ పొలార్డ్, ఆండ్రీ రస్సెల్ వంటి పవర్ హిట్టర్లు గతంలో వేసిన పునాదికి, ప్రస్తుత తరం ఆటగాళ్లు అందించిన సహకారానికి ఈ రికార్డు నిదర్శనంగా నిలిచింది. కాగా, ఈ సిక్సర్ల రేసులో వెస్టిండీస్‌కు టీమిండియా గట్టి పోటీ ఇస్తోంది. తాజా మ్యాచ్ ముగిసే సమయానికి భారత్ కూడా దాదాపు 1,997 సిక్సర్లతో రెండో స్థానంలో నిలిచింది. బుధవారం హైదరాబాద్‌లో జరగనున్న తదుపరి టీ20 మ్యాచ్‌లోనే భారత్ కూడా ఈ 2000 సిక్సర్ల క్లబ్‌లో చేరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ జాబితాలో న్యూజిలాండ్ సుమారు 1,585 సిక్సర్లతో మూడో స్థానంలో చాలా వెనుకబడి ఉంది. పవర్ హిట్టింగ్ విషయంలో విండీస్, భారత్ జట్లు ఎంత ఆధిపత్యం చెలాయిస్తున్నాయో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఫీల్డింగ్ తప్పిదాలు తగ్గాలి: మాజీ కోచ్ ఆర్ శ్రీధర్



టీ20 క్రికెట్‌లో భారత జట్టు ఫీల్డింగ్ ప్రమాణాలు పడిపోతుండటంపై మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్. శ్రీధర్ ఆందోళన వ్యక్తం చేశాడు. జట్టులో ఫీల్డింగ్ విషయంలో సమూల మార్పులు రావాలని, ఆటగాళ్లలో బాధ్యత పెంచే సంస్కృతిని నిర్మించాలని సూచించాడు. కొత్తగా జట్టులోకి వస్తున్న ఆటగాళ్లు ఫీల్డింగ్‌లో ఆశించిన స్థాయిలో సిద్ధంగా ఉండటం లేదని వ్యాఖ్యానించాడు. అక్టోబర్ 22 నుంచి ప్రారంభం కానున్న న్యూజిలాండ్ పర్యటన నేపథ్యంలో ఆర్. శ్రీధర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. 2026లో టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల గణాంకాల ప్రకారం.. క్యాచింగ్ సామర్థ్యంలో తొలి పది జట్లలో భారత్ చివరి నుంచి రెండో స్థానంలో ఉంది. భారత ఆటగాళ్లు 58 క్యాచ్‌లు వదిలేయగా, క్యాచింగ్ సామర్థ్యం 73.4 శాతంగా నమోదైంది. ఫీల్డింగ్ ద్వారా 129 పరుగులు ఆదా చేసినప్పటికీ, క్యాచ్‌లు వదిలేయడం, గ్రౌండ్ ఫీల్డింగ్‌లో తప్పిదాల కారణంగా 226 పరుగులు సమర్పించుకోవాల్సి వచ్చింది. ఫలితంగా నికరంగా 97 పరుగుల నష్టం వాటిల్లింది. రనౌట్ అవకాశాలను చేజార్చుకోవడంలోనూ భారత్ అన్ని జట్ల కంటే ముందుంది. 19 అవకాశాలను వదిలేయగా, 14 రనౌట్లు మాత్రమే చేసింది. ఐదు స్టంపింగ్ అవకాశాల్లో రెండింటిని కూడా చేజార్చుకుంది. టీ20 ప్రపంచకప్ గెలిచినప్పటికీ ఆ టోర్నీలోనూ భారత ఫీల్డింగ్ ఆశించిన స్థాయిలో లేదని శ్రీధర్ అన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్‌లో స్పష్టమైన ప్రణాళికలు కనిపిస్తున్నా.. ఫీల్డింగ్‌లో అలాంటి సంస్కృతి లోపించిందని అభిప్రాయపడ్డాడు. కొత్తగా వస్తున్న ఆటగాళ్లు బ్యాటింగ్‌పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారని, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్ తరానికి చెందిన ఆటగాళ్లతో పోలిస్తే ఫీల్డింగ్‌లో వెనుకబడుతున్నారని పేర్కొన్నాడు.

న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లకు పంత్ దూరం



ఈ నెలాఖరులో భారత్ 'ఏ' జట్టు మూడు మల్టీ డే మ్యాచ్‌ల కోసం న్యూజిలాండ్‌లో పర్యటించనుంది. ఈ టూరుకు ఇప్పటికే బీసీసీఐ భారత్ 'ఏ' జట్టును ప్రకటించింది. అయితే టీమిండియా వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ గాయం కారణంగా తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ విషయాన్ని బోర్డు సోమవారం వెల్లడించింది. ఈ టూరుకు పంత్‌ను ఫిట్‌నెస్‌కు లోబడే ఎంపిక చేసింది. కానీ ఇటీవల ఇరానీ కప్‌లో అతను గాయపడ్డాడు. ప్రస్తుతం అతను బీసీసీఐ మెడికల్ టీమ్ పర్యవేక్షణలో ఉన్నాడు. మూడో మ్యాచ్‌కు కూడా అతను అందుబాటులోకి రావడంపై అనుమానాలు నెలకొన్నాయి. తొలి రెండు మ్యాచ్‌లకు పంత్ స్థానంలో బీసీసీఐ కుమార్ కుషాగ్రాను ఎంపిక చేసింది. వచ్చే నెలలో న్యూజిలాండ్‌తో భారత జట్టు టెస్టు సిరీస్ ఆడబోతోంది. ఆ సిరీస్‌కు ఇంకా భారత జట్టును ప్రకటించలేదు. అయితే, పంత్ గాయపడటంతో ఆ సిరీస్‌కు అందుబాటులో ఉండటంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఈవార్తలు
ప్రజావాణి
మంగళవారం 13-10-2026, జగిత్యాల
www.evarthalu.com
ఈవార్తలు

ఈవార్తలు **సంపాదకీయం** Editorial


సామాన్యుడిపై మోయలేని భారం

ధరలు పెరగడం కొత్త విషయమేమీ కాదు. కానీ ఆదాయం పెరుగుదలతో పోలిస్తే నిత్యావసరాల ధరలు వేగంగా పెరుగుతున్నప్పుడు దాని ప్రభావం ప్రతి కుటుంబంపైనా తీవ్రంగా పడుతుంది. ద్రవ్యోల్బణం గణాంకాల్లో కనిపించే ఒక శాతం మాత్రమే కాదు.. అది సామాన్యుడి వంటింటి బడ్జెట్‌లో, పిల్లల చదువులో, కుటుంబ అవసరాల్లో ప్రత్యక్షంగా కనిపించే ఆర్థిక ఒత్తిడి. కూరగాయలు, పప్పులు, నూనెలు, పాలు, విద్యుత్, రవాణా, వైద్యం, విద్య.. ఇలా ఒకదాని తర్వాత మరొకటి ఖరీదవుతుంటే మధ్యతరగతి కుటుంబాల పొదుపు క్రమంగా కరిగిపోతోంది. తక్కువ ఆదాయ వర్గాల పరిస్థితి మరింత ఆందోళనకరం. ఆదాయంలో అధిక భాగం ఆహారం, ఇల్లు, రవాణా వంటి ప్రాథమిక అవసరాలకే వెచ్చించాల్సి రావడంతో ఇతర అవసరాలను వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ద్రవ్యోల్బణాన్ని కేవలం మార్కెట్ పరిణామంగా చూడటం సరైంది కాదు. ఉత్పత్తి వ్యయాలు, ఇంధన ధరలు, సరఫరా వ్యవస్థలో లోపాలు, వాతావరణ పరిస్థితులు, అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం వంటి అనేక అంశాలు ధరల పెరుగుదలకు కారణమవుతాయి. అయితే కారణాలు ఏవైనా.. చివరికి ఆ భారాన్ని మోయాల్సింది వినియోగదారుడే. అందుకే ప్రభుత్వాల బాధ్యత మరింత పెరుగుతుంది. ధరల పెరుగుదలను నియంత్రించేందుకు తాత్కాలిక చర్యలతో పాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టాలి. వ్యవసాయ ఉత్పత్తుల సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం, నిల్వ సదుపాయాలను విస్తరించడం, మధ్యవర్తిత్వ వ్యయాలను తగ్గించడం, అవసరమైన వస్తువుల మార్కెట్‌పై సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టడం అత్యవసరం. కృత్రిమ కొరత సృష్టించే అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఉద్యోగాలు, వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలపైనా ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. ధరలు పెరుగుతున్న వేళ ఆదాయ అవకాశాలు కూడా పెరగకపోతే ఆర్థిక వృద్ధి ఫలాలు సామాన్యుడికి అందినట్టు కాదు. ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చెప్పడానికి కేవలం వృద్ధి రేట్లు, పెట్టుబడులు, మార్కెట్ సూచీలను చూపడం సరిపోదు. ఒక సాధారణ కుటుంబం నెలాఖరులో అప్పు చేయకుండా తన అవసరాలను తీర్చుకోగలుగుతుందా? పొదుపు చేయగలుగుతుందా? పిల్లల చదువు, వైద్యం వంటి అనివార్య ఖర్చులను భరించగలుగుతుందా? అన్నదే అసలు కొలమానం. ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం అంటే కేవలం గణాంకాలను నియంత్రించడం కాదు.. ప్రజల కొనుగోలు శక్తిని కాపాడటం. సామాన్యుడి వంటింటి మంట చల్లారకుండా, అతని ఆదాయానికి తగ్గట్టుగా జీవన వ్యయం ఉండేలా చూడటమే సమర్థ ఆర్థిక పాలనకు అసలైన పరీక్ష. పెరుగుతున్న ధరలకు అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వాలు తక్షణ ఉపశమనంతో పాటు శాశ్వత పరిష్కారాల దిశగా అడుగులు వేయాలి.



ముందుచూపే రైతుకు శ్రీరామరక్ష

వాతావరణ మార్పులు వ్యవసాయానికి కొత్త సవాళ్లు విసురుతున్నాయి. ఎప్పుడు వర్షం పడుతుందో.. ఎంత పడుతుందో.. పడిన వర్షం పంటకు ఎంతవరకు ఉపయోగపడుతుందో అంచనా వేయడం కష్టంగా మారుతోంది. దీనికి తోడు ఎల్‌నినో ప్రభావంపై చర్చలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే ఎల్‌నినో వస్తుందంటే కరువు తప్పదని, వర్షాలు తగ్గిపోతాయని ముందుగానే నిర్ధారించుకోవడం ఎంత తప్పో.. వాతావరణ అనిశ్చితిని పట్టించుకోకుండా యథావిధిగా సాగుకు సిద్ధపడటం కూడా అంతే ప్రమాదకరం. భయంతో కాదు.. శాస్త్రీయ అవగాహనతో, అందుబాటులో ఉన్న వనరులను అంచనా వేసుకుని సాగు ప్రణాళిక రూపొందించుకోవడమే నేటి రైతు ముందున్న అసలైన మార్గం. తెలంగాణ వ్యవసాయంలో వర్షాధార సాగుకు కీలక స్థానం ఉంది. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేసే రైతులకు నీటి లభ్యతే దిగుబడిని, ఆదాయాన్ని నిర్ణయించే ప్రధాన అంశం. అలాంటి పరిస్థితుల్లో కేవలం గత ఏడాది మంచి దిగుబడి వచ్చిందనో, పక్క రైతు ఆ పంట వేస్తున్నాడనో అదే పంటను ఎంచుకోవడం సరైన నిర్ణయం కాదు. నేల స్వభావం, భూమిలో తేమ, స్థానిక వర్షపాత పరిస్థితులు, చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, బోరుబావుల్లో నీటి లభ్యతను బట్టి పంటను నిర్ణయించుకోవాలి. ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు సాగునీటి భరోసా లేనప్పుడు ప్రత్యామ్నాయాలను పరిశీలించాలి. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పెసర, మినుము వంటి పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఇతర స్వల్పకాలిక పంటలను ఎంచుకునే అవకాశాలను వ్యవసాయ అధికారులతో చర్చించాలి. అయితే స్వల్పకాలిక పంటలన్నీ తక్కువ నీటితోనే పండుతాయనే అపోహకు లోనుకాకూడదు. వాటి నీటి అవసరం, విత్తే సమయం, నేల అనుకూలత, మార్కెట్‌లో గిరాకీని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. వ్యవసాయంలో నష్టం జరిగిన తర్వాత పరిహారం కోసం ఎదురుచూడటం కంటే, నష్టం సంభవించే అవకాశాలను ముందుగానే తగ్గించుకోవడం మేలు. విత్తనాల ఎంపిక నుంచి పంట కోత వరకు ప్రతి దశలోనూ వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాలి. పంటల మార్పిడి, అంతర పంటల సాగు, నేలలో తేమను నిలుపుకునే పద్ధతులు, అవసరమైన చోట మల్చింగ్, బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి విధానాలను అనుసరించాలి. ఎరువులు, పురుగుమందుల వినియోగంలోనూ శాస్త్రీయ సూచనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వర్షం పడిన వెంటనే అందుబాటులో ఉన్న ప్రతి భూమిలోనూ సాగు ప్రారంభించాలనే తొందరపాటు వద్దు. నేలలో తగినంత తేమ ఉందా? రాబోయే రోజుల్లో వర్షాలపై అధికారిక అంచనాలేమిటి? ఎంచుకున్న పంటకు అవసరమైన నీటిని అందించగలమా? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకున్న తర్వాతే విత్తనాలు వేయాలి. సరైన సమయంలో తీసుకున్న నిర్ణయం రైతు పెట్టుబడిని కాపాడటంతోపాటు సాగు ఖర్చులను నియంత్రించగలదు. బోరుబావులపై ఆధారపడే రైతులు నీరు అందుబాటులో ఉందనే కారణంతో విచ్చలవిడిగా వినియోగించకూడదు. భూగర్భజలాలు తగ్గిపోతే ఒక పంటకే కాదు.. భవిష్యత్తు సాగుకూ ముప్పు ఏర్పడుతుంది. పంట అవసరానికి అనుగుణంగా నీటిని అందించడం, వర్షపు నీటిని పొలాల్లో నిల్వ చేసుకోవడం, నీటి వృథాను అరికట్టడం అలవాటుగా మార్చుకోవాలి. విద్యుత్ సరఫరా సమయాలు, సాగునీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలి. పండ్ల తోటల రైతులూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. మామిడి, జామ, నిమ్మ వంటి తోటల్లో మొక్కల వయస్సు, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటిని అందించాలి. పశుపోషణపై ఆధారపడే కుటుంబాలు తాగునీరు, పచ్చిమేత, ఎండుమేతకు ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలి. పంటలతోపాటు పశు సంపదను కాపాడుకోవడం కూడా రైతు కుటుంబ ఆర్థిక భద్రతలో భాగమే. రైతుకు ప్రకృతి అనుకూలించకపోతే ఎంత కష్టపడ్డా నష్టాలు తప్పకపోవచ్చు. అయినా సరైన సమాచారం, శాస్త్రీయ సాగు, నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన ద్వారా ప్రమాదాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చు. ఎల్‌నినోపై వచ్చే అంచనాలతో రైతులు భయపడాల్సిన అవసరం లేదు. కానీ వాతావరణ అనిశ్చితిని తేలికగా తీసుకునే పరిస్థితీ ఉండకూడదు. నీటి లభ్యతను అంచనా వేయడం, పంటను జాగ్రత్తగా ఎంచుకోవడం, సాగు ఖర్చులను నియంత్రించడం, అధికారిక సూచనలను పాటించడం అవసరం.



ఈదులపల్లి రవితేజ
వ్యవసాయ విస్తరణ అధికారి,
8897865899

మహిళే ప్రగతికి చోదకశక్తి

వ్యవసాయం అంటే కేవలం విత్తనం వేయడం, పంట పండించడం మాత్రమే కాదు. విత్తనాల ఎంపిక నుంచి పంట కోత వరకు, ధాన్యం నిల్వ నుంచి పశుపోషణ వరకు, కుటుంబ ఆహార భద్రత నుంచి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడం వరకు మహిళల పాత్ర విస్తృతమైనది. అయినప్పటికీ వారి శ్రమలో గణనీయమైన భాగానికి తగిన గుర్తింపు, ఆర్థిక విలువ, నిర్ణయాధికారం లభించడం లేదు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలుస్తున్న గ్రామీణ మహిళలను కేవలం రైతు కుటుంబ సభ్యులుగా కాకుండా, స్వతంత్ర రైతులుగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వ్యవసాయ కార్మిక శక్తిలో మహిళల వాటా దాదాపు 40 శాతంగా ఉంది. భారతదేశంలోనూ వ్యవసాయంపై ఆధారపడే మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2017-18లో మహిళా కార్మికుల్లో వ్యవసాయ రంగంలో పనిచేసేవారి వాటా 57 శాతంగా ఉండగా, 2023-24 నాటికి 64.4 శాతానికి చేరింది. ఈ గణాంకాలు వ్యవసాయంలో మహిళల ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తున్నాయి. అయితే పెరుగుతున్న భాగస్వామ్యానికి అనుగుణంగా వారి హక్కులు, ఆదాయం, ఆస్తి యాజమాన్యం, నిర్ణయాధికారం పెరుగుతున్నాయా అన్నది కీలకమైన ప్రశ్న. పొలంలో విత్తనాలు వేయడం, కలుపు తీయడం, పంట కోయడం వంటి పనులతోపాటు పశువుల సంరక్షణ, పాల ఉత్పత్తి, ధాన్యం శుద్ధి, నిల్వ వంటి బాధ్యతలను మహిళలు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు ఇంటి పనులు, పిల్లల సంరక్షణ, కుటుంబ అవసరాలను కూడా చూసుకుంటున్నారు. ఇంతటి శ్రమ చేసినా అనేక సందర్భాల్లో వారి కృషి కుటుంబ సహాయక పనిగానే మిగిలిపోతోంది. వ్యవసాయ ఉత్పత్తిలో ప్రత్యక్షంగా భాగస్వాములైన మహిళలకు తగిన పారితోషికం, ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక గౌరవం అందాలి. మహిళా రైతుల సాధికారతకు భూమిపై హక్కు అత్యంత కీలకం. భూమి పట్టా మహిళ పేరుపై లేకపోవడం వల్ల వ్యవసాయ రుణాలు, పంట బీమా, ప్రభుత్వ రాయితీలు, శిక్షణ వంటి ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భూమిని సాగు చేస్తున్న మహిళకు రైతుగా అధికారిక గుర్తింపు లభించాలి. వ్యవసాయ రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఆధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ సమాచారం నేరుగా అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. మహిళా స్వయం సహాయక సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. పశు పోషణ, ఆహార పదార్థాల తయారీ, విత్తన ఉత్పత్తి, వ్యవసాయ ఉత్పత్తుల విలువ పెంపు, మార్కెటింగ్ వంటి రంగాల్లో మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాలి. మహిళల ఆధ్వర్యంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలు బలోపేతమైతే ఉత్పత్తుల విక్రయం నుంచి వచ్చే ఆదాయంలో వారి వాటా పెరుగుతుంది. వాతావరణ మార్పులు, నీటి కొరత, వ్యవసాయ ఖర్చుల పెరుగుదల వంటి సవాళ్లను ఎదుర్కోవడంలోనూ మహిళల అనుభవం విలువైనది. స్థానిక విత్తనాల సంరక్షణ, పంటల వైవిధ్యం, పశుసంపద నిర్వహణలో వారి పరిజ్ఞానాన్ని వ్యవసాయ పరిశోధన, శిక్షణా కార్యక్రమాలతో అనుసంధానించాలి. మొబైల్ ఫోన్లు, వాతావరణ సమాచారం, డిజిటల్ మార్కెట్లు, పంట ధరల వివరాలు మహిళా రైతులకు సులభంగా అందుబాటులోకి రావాలి. తెలంగాణలో వరి, పత్తి, మిరప, పసుపు, కూరగాయలు, పండ్ల సాగుతోపాటు పాడి, గొర్రెలు, మేకల పెంపకంలోనూ గ్రామీణ మహిళల కృషి గణనీయమైనది. వారి అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ శిక్షణ, రుణ సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలి. తాగునీరు, ఆరోగ్య సేవలు, పారిశుద్ధ్యం, పిల్లల సంరక్షణ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా మహిళలపై ఉన్న అదనపు భారాన్ని తగ్గించాలి. 2026ను ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా రైతుల సంవత్సరంగా ప్రకటించడం మహిళల కృషిని గుర్తించడానికి, వారి హక్కులను బలోపేతం చేయడానికి ఒక ముఖ్యమైన అవకాశంగా భావించాలి. అక్టోబర్ 15న అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవాన్ని నిర్వహించడం వేడుకలకే పరిమితం కాకూడదు. మహిళా రైతులకు భూమిపై హక్కులు, సమాన వేతనం, రుణ సదుపాయాలు, సాంకేతిక శిక్షణ, మార్కెట్ ప్రాప్యత, నిర్ణయాధికారం కల్పించే దిశగా కార్యాచరణ ఉండాలి. వ్యవసాయాన్ని బలోపేతం చేయాలంటే మహిళా రైతును బలోపేతం చేయాలి. ఆహార భద్రతను కాపాడాలంటే ఆమె శ్రమకు గుర్తింపు ఇవ్వాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే ఆమెకు సమాన అవకాశాలు కల్పించాలి. మహిళను కేవలం రైతు భార్యగా కాకుండా రైతుగా గుర్తించి, వ్యవసాయ విధానాల్లో ఆమెకు తగిన స్థానం కల్పించినప్పుడే గ్రామీణ ప్రగతి సంపూర్ణమవుతుంది.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811.
Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.